# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
25-6-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 95

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## రాయలసీమపై పవన్ గురి!

జనసేనలో చేరికలకు ప్రోత్సాహం

రెడ్డి, బలిజ సామాజిక వర్గాలపై ఫోకస్

మాజీ మంత్రి బాలినేనికి కీలక బాధ్యతలు

**క్రైమ్ మిర్రర్,, ఏపీ బ్యూరో :** జనసేనలో భారీగా చేరికలు ఉంటాయని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా రాయలసీమ నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువగా నేతలు చేరుతారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. వైసీపీలో అసంతృప్తిగా ఉన్న నేతలు, నాయకత్వం పై నమ్మకం లేని క్యాడర్ను జనసేన వైపు రప్పించేలా భారీగా

- మిగతా 3వ పేజీలో



## ఎస్బీఐ వివాదం కొలిక్కి!

దారికి తెచ్చుకున్న రేవంత్ సర్కార్

పాత స్థలానికి బదులు మరో చోట భూమి ఇచ్చేందుకు కుదిరిన అంగీకారం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వానికి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాజమాన్యానికి గత కొద్ది రోజులుగా వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఐటీ కారిడార్ లోని అత్యంత ఖరీదైన రాయదుర్గం

- మిగతా 2వ పేజీలో

## తుంగభద్ర, ఆర్డీఎస్‌లపై
# సిఎం రేవంత్ సమీక్ష

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అధికారులు

సమీక్షలో పాల్గొన్న మంత్రులు, అధికారులు



జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఇటీవల కర్నాటక వివిధ ప్రాజెక్టును కడుతున్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో తుంగభద్ర జలాల్లో మన వాటా విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది.

హైదరాబాద్,జూన్24(ఆర్ఎన్ఎ): ఈ క్రమంలో సిఎం దీనిపై సమీక్షించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, ఇరిగేషన్ సెక్రెటరీ శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. తుంగభద్ర పైన నీటిపారుదల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు..రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు

- మిగతా 2వ పేజీలో



## ఇక విజయ్ మేనమామ!

తమిళనాడులో సరికొత్త పథకం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే చిన్నారికి గ్రామ గోల్డ్ రింగ్

జీవో జారీ చేసిన సీఎం దళపతి విజయ్

2లో

## సాయికృష్ణది లాకప్ డెత్!


తేల్చేసిన పోలీసులు

సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

అదృశ్యం కేసు.. హత్యగా యూటర్న్



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో సాయి కృష్ణ అదృశ్యం కేసు ఊహించని మలుపు తిరిగింది.




# తెలంగాణలో లక్షల ఓట్లు మాయం?!

ఆందోళనలో రాజకీయ పార్టీలు

మ్యాపింగ్ ప్రక్రియలో అడుగడుగునా అంతరాయాలు

తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రతిష్టాత్మకంగా జరుగుతోంది. అయితే ఏపీతో పోల్చుకుంటే తెలంగాణలో కాస్త ముందుగా ప్రారంభం అయింది. అయితే ఈ అంశం తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీల్లో టెన్షన్ పుట్టిస్తోంది. దాదాపు రెండు పుష్కరాల తరువాత ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. దీనికి ముందు నిర్వహించిన ప్రీ మ్యాపింగ్ ప్రక్రియలో ఊహించని షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 85 లక్షల నుంచి 90 లక్షల మంది వరకు ఓటర్ల డేటాలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించడం హాట్ టాపిక్ అవుతోంది.

హైదరాబాదులోనే అధికం..

దేశంలో అన్ని ప్రాంతాల వారు నివసించేది భాగ్యనగరంలోనే. అటువంటి చోట పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది.

- మిగతా 2వ పేజీలో

### విజయనగరం బరిలో
# కోలగట్ల శ్రావణి!

ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజును ఢీకొట్టేందుకు సన్నద్ధం

జగన్ గ్రీన్ సిగ్నల్



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ఉమ్మడి రాష్ట్రంలోనే విజయనగరం జిల్లాకు రాజకీయంగా ప్రత్యేక స్థానం. ఇక్కడ నుంచి సుదీర్ఘ రాజకీయాలు చేశారు పూసపాటి అశోక్ గజపతిరాజు. తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం వివిధ హోదాలో పనిచేశారు ఆయన. మొన్ననే గోవా గవర్నర్ గా నియమితులు అయ్యారు. ప్రస్తుతం ఆయన కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆమెపై పోటీ చేసేందుకు మరో మహిళ నేత సిద్ధపడుతున్నారు. ఆమె కోలగట్ల శ్రావణి. ఏపీ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కుమార్తె.

2లో

# ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైంది

రాయలసీమ రతనాలసీమగా మారబోతోంది

జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయి

భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుంది

శరవేగంగా సీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

గొడ్డలి పార్టీ కుల రాజకీయాలతో అప్రమత్తంగా ఉండాలి

జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు

కర్నూలు,జూన్24(ఆర్ఎన్ఎ): ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైందని.. రాయలసీమ రతనాలసీమగా మారబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం జొన్నగిరిలో గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..



3లో



# క్యాబినెట్‌లోకి వంగవీటి రాధా!

ముందుగా ఎమ్మెల్సీగా ఎంపిక

తరువాత మంత్రివర్గంలోకి

చంద్రబాబు, లోకేష్ గ్రీన్ సిగ్నల్

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో,:

ఏపీలో ప్రస్తుతం కాపుల చుట్టూ రాజకీయం తిరుగుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు రాజకీయం చేస్తోంది. దానికి విరుగుడుగా కూటమి గట్టి చర్యలే చేపడుతోంది.

## నక్కపల్లిలో గురుకుల పాఠశాల ఏర్పాటు

### సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి అనిత

అనకాపల్లి: జిల్లాలోని నక్కలపల్లిలో మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నక్కపల్లిలో ప్రత్యేక బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని స్థానిక మత్స్యకారులు, బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారి అభ్యర్థనను పరిశీలించిన ప్రభుత్వం పాఠశాల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు హోం మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించి పాఠశాల మంజూరు



చేసినందుకు వారిద్దరికీ ధన్యవాదాలు తెలియజేశారు.నక్కపల్లికి బీసీ గురుకుల పాఠశాల మంజూరు విషయంలో హోం మంత్రి అనిత ప్రత్యేకంగా కృషి చేశారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అనిత అన్నారు. గురుకుల పాఠశాల ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మత్స్యకార కుటుంబాల విద్యార్థుల విద్యాభివృద్ధికి గురుకుల పాఠశాల ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. 'నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే నా లక్ష్యం' అని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. బీసీ గురుకుల పాఠశాల మంజూరు కావడంతో పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు, బీసీ సంఘాల నాయకులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు.. హోం మంత్రి వంగలపూడి అనితకు కృతజ్ఞతలు తెలిపారు.


# తెలంగాణలో లక్షల ఓట్లు మాయం?!

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ సగానికి పైగా వాటర్లు పాత రికార్డులతో మ్యాప్ కావడం లేదు. హైదరాబాద్ 45% , మేడ్చల్ మల్కాజ్గిరిలో 43%, రంగారెడ్డిలో 56% ఓట్లు ఉంటే దాదాపు 57 లక్షల మంది ఓటర్లు ఇంకా మ్యాపింగ్ పరిధిలోకి రాలేదు. వలసలు, అద్దె ఇల్లు మారడం, పేర్లలో స్పెల్లింగ్ తప్పులు, తండ్రి, బంధువుల పేర్లలో వ్యత్యాసాలు, వయసుకు సంబంధించిన సాంకేతిక లోపాలు అంటే తండ్రికి, బిడ్డకు మధ్య కేవలం 15 ఏళ్ల లోపు వయసు వ్యత్యాసం చూపించడం వంటివి ఈ మ్యాపింగ్ వైఫల్యానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. అయితే కేవలం ఈ మ్యాపింగ్ కారణంతోనే ఓట్లను తొలగించబోమని అధికారులు చెబుతున్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటికి మూడుసార్లు స్వయంగా వెళ్లి.. ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి.. వివరాలు సేకరిస్తారు. జూలై 31న డ్రాఫ్ట్ రోల్ విడుదలయ్యాక.. సెప్టెంబర్ 28 వరకు నోటీసుల దశ ఉంటుంది.

**సామాన్యులు విసిగిపోతారని భయం..**

సాధారణంగా నిరక్షరాస్యులు వలస కూలీలు గందరగోళంలో పడి తమ ఓటు హక్కును కోల్పోతారేమో నన్న భయాందోళన వ్యక్తమౌతోంది. అయితే తాము




నిజమైన ఓటర్లను అని నిరూపించుకునేందుకు చాలామంది కార్యాలయాల చుట్టూ తిరిగేందుకు ఇష్టపడరు. అందుకే తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి.. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పై దృష్టిపెట్టాయి. బూత్ లెవెల్ ప్రతినిధులను రంగంలోకి దించాయి..

# సాయికృష్ణది లాకప్ డెత్!

గత కొద్దిరోజులుగా అదృశ్యం అయినట్లు భావిస్తున్న సాయి కృష్ణ లాకప్ డెత్ కు గురైనట్లు స్పష్టమైంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక విచారణ బృందం అధికారులు విజయవాడ కోర్టులో దాఖలు చేసిన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టులు సంచలన విషయాలు వెల్లడించారు. సాయి కృష్ణా పోలీసులు చేతుల్లో కస్టోడియల్ డెత్ కు గురయ్యారని నిర్ధారించారు. సాయి కృష్ణను నాన్ బెయిలబుల్ వారంటీ కింద అదుపులోకి తీసుకొని... ఆ తరువాత కోర్టులో హాజరు పరచకుండా.. స్టేషన్లోనే మాయం చేశారని రిమాండ్ రిపోర్టులో ప్రత్యేక దర్యాప్తు బృందం స్పష్టం చేసింది.

**సంచలన నిజాలు..**

సాయి కృష్ణ లాకప్ డెత్ కు సంబంధించి సంచలన అంశాలు వెలుగులోకి వచ్చాయి. మే 6న సాయి కృష్ణను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెంటనే అతడిని కృష్ణలంక సీఐ నాగరాజుకు అప్పగించారు. సాయి కృష్ణ మృతదేహాన్ని కృష్ణలంక పోలీస్ స్టేషన్లోనే స్వయంగా చూసినట్లు సదరు స్టేషన్ ఎస్ఐ ప్రత్యేక దర్యాప్తు బృందం ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. ఈ కేసులో ఇదే ప్రాధాన్యత అంశంగా మారింది. మే 6 నుంచి మే 8 మధ్యకాలంలో ఒక ఫ్లిప్కార్ట్ డెలివరీ బాయ్ స్టేషన్కు వెళ్లిన సమయంలో అక్కడ సాయి కృష్ణకు గుర్తించినట్లు కూడా సిట్ విచారణలో తేలింది. మొత్తం 17 మంది సాక్షులను సీట్ విచారించింది.

**పక్కా ప్రణాళికతోనే..**

అయితే ఈ మొత్తం కేసులో సీఐ నాగరాజు పాత్ర ఇప్పుడు కీలకం. సాక్షాధారాలను చెరిపేసేందుకు పక్కా క్రిమినల్ ప్రణాళిక అమలు చేసినట్లు సీట్ గుర్తించింది. స్టేషన్ పరిధిలో మే ఒకటి నుంచి జూన్ 1 వరకు సీసీటీవీ ఫుటేజ్ డేటా ప్రస్తుతం స్టేషన్ సిస్టంలో లేకుండా డిలీట్ చేశారు. అయితే ఫోరెన్సిక్ బృందం సహాయంతో సీసీ కెమెరా ఫీడ్ బ్యాక్ ను, కేసు నమోదు చేసిన డైరీని సిట్ స్వాధీనం చేసుకుంది. మరోవైపు స్టేషన్లో పనిచేస్తున్న హిమజాను సైతం విచారించారు. అసలు సాయి కృష్ణను అదుపులోకి తీసుకొని చట్టప్రకారం న్యాయస్థానంలో ఎందుకు హాజరు పరచలేదు? స్టేషన్లో సిసి ఫుటేజ్ ఎందుకు డిలీట్ అయింది? అనే ప్రశ్నలకు సిఐ నాగరాజు నుంచి ఎలాంటి సరైన సమాధానం లేకుండా పోయినట్లు తెలుస్తోంది.

లి తల్లి అనుమానాలే నిజం..

కేవలం సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగానే లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు చెబుతున్నారు. ఆది నుంచి ఆమె తన కుమారుడిని పోలీసులే చంపేసి దహనం చేశారంటూ ఆరోపణలు చేస్తోంది. అయితే ఈ ఆరోపణపై పదే పదే ప్రస్తావించినా.. సీఐ నాగరాజు నోరు విప్పడం లేదని తెలుస్తోంది. అయితే ఈ కుట్రలో ఇతర పాత్రధారులపై కూడా ప్రత్యేక దర్యాప్తు బృందం లోతుగా విచారణ చేపడుతోంది. సాయి కృష్ణ చనిపోయాడని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించడంతో ఈ అదృశ్యం కేసు కాస్త హత్య కేసుగా మారింది.

# ఎస్బిఐ వివాదం కొలిక్కి!

(మొదటి పేజీ తరువాయి)

భూ వివాదం తలెత్తింది. అయితే అది ఎట్టక్కాలకు ఒక కొలిక్కి వచ్చింది. రాయదుర్గం ప్రాంతంలో ఉన్న వివాదాస్పద స్థలం పై హైకోర్టులో ఎస్బిఐ పిటిషన్ దాఖలు చేసింది. దీనిని ప్రభుత్వం కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంలో పట్టుదలతో ఉన్నారు. అయితే కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ను ఉపసంహరించుకునేందుకు ఎస్బిఐ సిద్ధపడిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, బ్యాంకు అగ్ర నాయకత్వంతో జరిపిన సుదీర్ఘ చర్చలు విజయవంతం కావడంతో.. ఈ వివాదానికి తెరపడినట్లు అయ్యింది.

**ఐటి క్యారిడార్ లో స్థలం..**

రాయదుర్గం వివాదం లో ఉన్న పాత స్థలానికి బదులు.. ప్రత్యామ్నాయంగా ఐటీ కారిడార్ సమీపంలోని మరో ప్రాంతంలో 2.5 ఎకరాల భూమిని కేటాయించేందుకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. ఈ ప్రభుత్వ ప్రతిపాదనకు ఎస్బిఐ యాజమాన్యం కూడా సానుకూలంగా స్పందించింది. ఆ స్థలం తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేసింది. అన్ని రకాల ప్రభుత్వ బ్యాంకింగ్ లావాదేవీలను యధావిధిగా కొనసాగించేందుకు బ్యాంకు అంగీకారం తెలిపింది. ఎందుకంటే భూ వివాదం నేపథ్యంలో ఆ లావాదేవీలన్నింటిని నిలిపివేస్తామని ఎస్బిఐ హెచ్చరించడంతో తెలంగాణ ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. అయితే ఇప్పుడు ఆ సమస్యకు పరిష్కారం దొరికినట్లు అయింది.

**ఆందోళనలకు చెక్...**

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కీలకమైన ఫిక్స్డ్ డిపాజిట్లు, ప్రభుత్వ గ్రాంట్లు, వివిధ కార్పొరేషన్ల ఖాతాల నిర్వహణ అంతా ఎస్బిఐ నిలిపివేస్తుందని ఆందోళన వ్యక్తం అయింది. రాష్ట్రంలో లీడ్ బ్యాంకు గా ఎస్బిఐ ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ఆర్థిక సమన్వయం కూడా ఎస్బిఐ చూస్తోంది. అయితే తాజా వివాదంతో ప్రభుత్వ బ్యాంకింగ్ లావాదేవీలు వేరే బ్యాంకులకు తరలిపోకుండా నిలువరించడంలో రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు కీలక పాత్ర పోషించారు. ఎస్బిఐ యాజమాన్యంతో చర్చలు ఫలప్రదంగా ముగించారు. దీంతో సమస్యకు పరిష్కార మార్గం దొరికింది. రాయదుర్గం భూ కేటాయింపులు, కోర్టు వెలుపల జరిగిన ఈ సెటిల్మెంట్కు సంబంధించిన అధికారిక ప్రక్రియ దాదాపు ముగిసినట్లు అయ్యింది. మరోవైపు హైకోర్టుకు ఇప్పటికే ఆశ్రయించిన ఎస్బిఐ తన పిటిషన్ ను అధికారికంగా ఒప్పసంహరించుకుంటున్నట్లు న్యాయస్థానానికి తెలపనుంది.

# తుంగభద్ర, ఆర్డీఎస్‌లపై సిఎం రేవంత్ సమీక్ష

రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న ఆందోళన నెలకొంది. రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఆర్డీఎస్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సరిగా అందని పరిస్థితి ఉంది. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయి. తుంగభద్ర జలాలను కర్ణాటక ఇష్టారాజ్యంగా వినియోగించకుండా బచావత్ ట్రిబ్యునల్ అనేక నిబంధనలను కృష్ణా అవార్డులో పొందుపరచింది. అయినప్పటికీ ఆ నిబంధనలు ఖాతరు చేయకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా బ్రిడ్జి కం బ్యారేజీలను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడానికి పూనుకుందన్న ప్రచారం ఉంది. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరం ఉందని గ్రహించిన సిఎం వీటిపై ఆరా తీసారు. దీంతో మంత్రులు, అధికారులతో ఆయన సమీక్షించారు. ఇదిలావుంటే తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు మాజీమంత్రి హరీష్ రావు సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు.

# విజయనగరం బరిలో కోలగట్ల శ్రావణి!

గత కొంతకాలంగా పోటీకి అన్ని విధాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**జెయింట్ కిల్లర్ గా వీరభద్ర స్వామి**

కోలగట్ల వీరభద్ర స్వామి అశోక్ గజపతి రాజును ఓడించి జైంట్ కిల్లర్ గా నిలిచారు. 1978 నుంచి 1999 వరకు విజయం సాధిస్తూ వచ్చారు అశోక్ గజపతిరాజు. కానీ తొలిసారిగా 2004లో ఆయనకు ఓటమి ఎదురైంది. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కోలగట్ల వీరభద్ర స్వామి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ 2009లో అదే వీరభద్ర స్వామిని ఓడించారు అశోక్ గజపతిరాజు. 2014లో ఎమ్మెల్యేగా కాకుండా ఎంపీగా పోటీ చేసి గెలిచారు. కేంద్ర మంత్రి అయ్యారు. 2019లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారు. ఆయన కుమార్తె అదితి గజపతిరాజు పోటీ చేయగా వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కోలగట్ల గెలిచారు ఆమెపై. ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ గా కూడా వ్యవహరించారు. అయితే మొన్నటి ఎన్నికల్లో మాత్రం అదితి గజపతిరాజు చేతిలో కోలగట్లకు ఓటమి తప్పలేదు.



**అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్న శ్రావణి**

మరోవైపు వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగేందుకు కోలగట్ల వీరభద్ర స్వామి కుమార్తె శ్రావణి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆమె విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ గా కూడా ఐదేళ్లపాటు కొనసాగారు. తండ్రికి తగ్గ వారసురాలిగా రాజకీయాల్లో దూకుడుగా ఉంటారు శ్రావణి. 2029 ఎన్నికల్లో ఆమె పోటీ చేసేందుకు జగన్మోహన్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే జరిగితే రాజకుమార్తే అదితి వర్సెస్ కోలగట్ల శ్రావణి అన్నట్టు ఉంటుంది అక్కడి పరిస్థితి. అయితే వచ్చే ఎన్నికల్లో బీసీలకు టికెట్ కేటాయించాలని తెలుగుదేశం పార్టీతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి డిమాండ్ ఉంది. మరి ఆ రెండు పార్టీలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయో చూడాలి.

# ఇక విజయ్ మేనమామ!

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడు సీఎం విజయ్ దూకుడు మీద ఉన్నారు. దూకుడు నిర్ణ యాలు తీసుకుంటున్నారు. నిన్ననే తమిళనాడు వ్యాప్తంగా విజయ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో ఈరోజు విజయ్ వినూత్న పథకం ప్రకటించారు. ప్రభుత్వాసుపత్రుల్లో జన్మించే ప్రతి పసిబిడ్డకు ఒక గ్రామ బంగారం ఉంగరాన్ని ఉచితంగా.. బహుమతిగా అందించేలా ప్రభుత్వం అధికారికంగా జీవో జారీ చేసింది. ఈ వినూత్న పథకం ఇప్పుడు తమిళనాడు వ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. అయితే ఈ సరికొత్త పథకానికి ముఖ్యమంత్రి విజయ్ పేరు మీదుగా విజయ్ మేనమామ పథకంగా పేరు పెట్టారు. అయితే విజయ్ తీసుకున్న ఈ నిర్ణయం గొప్ప వినూత్నంగా ఉంది.

**అనాదిగా సంప్రదాయం..**

తమిళ సంప్రదాయంలో చెల్లెలికి పుట్టిన బిడ్డకు మేనమామ బంగారు ఆభరణాన్ని బహుమతిగా ఇవ్వడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ సెంటిమెంట్ ను క్యాష్ చేసుకుంటూ.. రాష్ట్రంలో పుట్టే ప్రతి బిడ్డకు తానే ఒక మేనమామ గా ఉండి.. ఒక బంగారు ఉంగరాన్ని కానుకగా ఇస్తానని సీఎం విజయ్ ప్రకటించారు. గర్భిణీ స్త్రీలు ప్రసవం కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్యను భారీగా పెంచాలని ఉద్దేశంతోనే ఈ మాస్టర్ ప్లాన్ తీసుకొచ్చారు దళపతి విజయ్. నిన్ననే పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు



విజయ్. ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలు చేస్తూ వెంటనే జీవో విడుదల చేయడం విశేషం.

**ప్రజల నుంచి విశేష స్పందన..**

సీఎం విజయ్ ప్రకటించిన ఈ పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరే పేద కుటుంబాలకు ఈ పథకం ఒక పెద్ద ఆర్థిక, సామాజిక భరోసాగా నిలవనుంది. పసిబిడ్డ పాదాలు ఇంట్లో పడకముందే.. ప్రభుత్వం తరపున లక్ష్మీదేవి లాంటి బంగారం అందే అవకాశం ఉండడంతో తల్లులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జనరల్ ఆసుపత్రుల వరకు.. అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ఈ పథకం తక్షణమే అమల్లోకి వచ్చేలా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అయితే పథకాలు అంటేనే తమిళనాడు గుర్తుకొచ్చేలా ఉంటుంది పరిస్థితి. అటువంటి రాష్ట్రంలో విజయ్ అమ్ముల పొది నుంచి వచ్చిన ఈ పథకం వినూత్నంగా నిలవనుంది.




# ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైంది

(మొదటి పేజీ తరువాయి)

జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయన్నారు. గతంలో జొన్నగిరిని స్వర్ణగిరిగా పిలిచేవారని.. మన దగ్గర కూడా బంగారం ఉత్పత్తి కాబోతోందని తెలిపారు. భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుందని వెల్లడించారు. ఒకప్పుడు కెజిఎఫ్... ఇప్పుడు జెజిఎఫ్ అని ముఖ్యమంత్రి అన్నారు. చమురు తర్వాత దేశంలో ఎక్కువ దిగుమతి అయ్యేది బంగారమే అని తెలిపారు. రాయలసీమలో సిరులు పండించేందుకు శరవేగంగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ప్రస్తుతం 400 కిలోల సామర్థ్యంతో బంగారం ఉత్పత్తి అవుతుందని, భవిష్యత్‌లో 1000 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. రెండో యూనిట్‌తో కలిపి 50 టన్నుల బంగారం ఉత్పత్తి అవుతుందన్నారు. ఇప్పటికే 800 మందికి ఉద్యోగాలు లభించాయని.. త్వరలో మరో 1500 మందికి ఉపాధి లభించనుందన్నారు. భవిష్యత్‌లో 5 వేల మందికి స్వర్ణగిరి గోల్డ్ మైన్స్‌లో ఉపాధి లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. గోల్డ్ మైనింగ్‌తో జొన్నగిరిలో పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టామని అన్నారు.రాయలసీమను రతనాల సీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతాన్ని గతంలో సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగో రాజధాని ఇది. జొన్నగిరిని సువర్ణగిరిగా మార్చుకుందామా? వందల ఏళ్ల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. అశోకుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెబుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి సీమను కాపాడాలనే ఆలోచన చేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన నిర్ణయంతో రాయలసీమ ప్రాంతానికి ప్రాణం పోశాం అని అన్నారు. ఇప్పటికి 400 కిలోల సామర్థ్యంతో ప్రారంభమైంది. భవిష్యత్తులో వెయ్యి కిలోలకు చేరుతుంది. ఇప్పటికే 800 ఉద్యోగాలు వచ్చాయి.




త్వరలో 1500 మందికి ఉపాధి కల్పిస్తాం. భవిష్యత్తులో 5వేల మందికి ఈ గోల్డ్ మైన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. జొన్నగిరి రాష్ట్రానికి ఆదర్శంగా తయారవుతుంది. ఈ ప్రాంతానికి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుంది. ఇక్కడ నగల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఆంధ్రప్రదేశ్ చిరునామాగా మారింది. రాయలసీమకు ఇన్ని పరిశ్రమలు వస్తాయని అనుకున్నారా?దేశంలోనే అతిపెద్ద డ్రోన్ సిటీ కర్నూలులో వస్తోంది. వీలైనంత త్వరగా కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తాం. 2028 నాటికి రాయలసీమలో స్టీల్ ప్లాంట్ ప్రారంభిస్తాం అన్నారు. 2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంస పాలన నడిచింది. వేంకటేశ్వరస్వామికి అపచారం జరిగితే శిక్షించాలా..లేదా? స్వామివారి ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపారు. ఇప్పుడు దేవుడి దగ్గరకు వెళ్లి దండాలు పెడుతున్నారు. దేవుడిని నమ్మే ఏ వ్యక్తి కూడా వాళ్లను క్షమించడు. ప్రజలకు ఏవిధంగా మంచి చేయాలనేదే నా ఆలోచన. గొడ్డలి పార్టీ విషాన్ని చిమ్ముతోంది. నేరాలు చేయడంలో ఆ పార్టీ నేతలు సమర్థులు. సాయికృష్ణ ఘటనకు కూడా కులం రంగు పులిమారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై నోరుపారేసుకుంటున్నారు. అలాంటి వారి నోరు మూయించే శక్తి మాకుంది. మెగా డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత పేపర్ లీకైందని ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై చర్చకు రమ్మని మంత్రి లోకేశ్ సవాల్ విసిరితే రాలేదు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా దాదాపు 11వేల మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు తీసుకొచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాం' అని చంద్రబాబు అన్నారు. కులమతాల పేరుతో గొడ్డలి పార్టీ విషం చిమ్ముతోందన్నారు. నేరాలు, ఘోరాలు చేసి రాజకీయ రంగు పులుముతున్నారన్ని ÷ర్ అయ్యారు. రప్పా రప్పా రాజకీయం తప్ప గొడ్డలి పార్టీ చేసిందేమీలేదన్నారు. మళ్లీ వస్తాం.. గొడ్డలితో రప్పా రప్పా ఆడిస్తామంటున్నారని సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# క్యాబినెట్‌లోకి వంగవీటి రాధా!

అందులో భాగంగా ఈసారి రాజకీయంగా కాపు సామాజిక వర్గానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్సీ పదవుల నియామకాల తో పాటు క్యాబినెట్ విస్తరణలో ఆ సామాజిక వర్గానికి పెద్ద పీట వేయాలని చూస్తోంది. అనూహ్యంగా వంగవీటి రాధాకృష్ణను క్యాబినెట్ లోకి తీసుకోవడమే కాకుండా ఆయన సోదరి ఆశాకిరణ్ ను టిడిపిలో చేర్పించేందుకు పక్కా పొలిటికల్ ప్లాన్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా వంగవీటి రాధాకృష్ణ తెలుగుదేశం పార్టీలోనే ఉన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆయన టిడిపిలో చేరారు. అప్పట్లో టిడిపి అధికారంలోకి వచ్చి ఉంటే ఎమ్మెల్సీ పదవి దక్కి ఉండేది రాధాకృష్ణకు. కానీ టిడిపి అధికారంలోకి రాలేదు. వంగవీటి రాధాకృష్ణ వేరే పార్టీలోకి మారలేదు. మొన్నటి ఎన్నికల్లో కూడా ఆయన పెద్దగా టికెట్ ఆశించలేదు. కానీ కూటమికి మద్దతుగా ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి రావడంతో ఆయనకు నామినేటెడ్ పదవి ఖాయమని ప్రచారం జరిగింది. అయితే రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తయింది. అందులో రాధాకృష్ణకు చోటు దక్కకపోవడంతో.. ఎమ్మెల్సీ కానీ.. రాజ్యసభ పదవి కానీ ఇస్తారని స్పష్టమైంది. అయితే తాజాగా సరికొత్త ప్రచారం ఒకటి మొదలైంది. వంగవీటి రాధాకృష్ణకు ఎమ్మెల్సీ పదవితో పాటు రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారని తెలుస్తోంది.

**ఆశా కిరణ్ సైతం..**

మరోవైపు వంగవీటి వారసురాలు ఆషాకిరణ్ సైతం పొలిటికల్ ఎంట్రీ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రంగా రాధా మిత్రమండలి ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కు ముందు కాపు సామాజిక వర్గానికి ఎవరు మేలు చేస్తే అటువైపు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో వంగవీటి రాధాకృష్ణకు మంత్రి పదవి ఇచ్చి ఆశాకిరణ్ ను సైతం తమ వైపుకు తిప్పుకోవాలని టిడిపి వ్యూహంగా తెలుస్తోంది.

**సరైన నిర్ణయాలు తీసుకోవడంలో..**

వంగవీటి రాధాకృష్ణ 2004లో తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. అప్పట్లో రాజశేఖర్ రెడ్డి పిలుపుతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేయడంతో అందులో చేరారు. పిఆర్పి అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత జగన్ వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే రాజకీయంగా సరైన నిర్ణయాలు తీసుకోవడంలో రాధాకృష్ణ విఫలమయ్యారు. అందుకే ఆయనకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. అయితే ఈసారి చంద్రబాబుతో పాటు లోకేష్ రాధాకృష్ణ రాజకీయ భవిష్యత్తుకు హామీ ఇచ్చారు. కేవలం ఎమ్మెల్సీగా కాకుండా మంత్రిగా కూడా అవకాశం ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే కూటమి విషయంలో కాపుల సానుకూలత మరింత పెరిగే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# రాయలసీమపై పవన్ గురి!

వ్యూహం అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి ద్వారా పవన్ కళ్యాణ్ గట్టి ప్రయత్నాల్లోనే ఉన్నట్లు సమాచారం. ప్రకాశం, నెల్లూరు తో పాటు ఉభయ రాయలసీమ జిల్లాల్లో పార్టీ బాధ్యతలను మొత్తం బాలినేనికి పవన్ కళ్యాణ్ అప్పగించినట్లు తెలుస్తోంది. మొన్ననే 14 మంది నాయకులతో చేరికల కమిటీని ఏర్పాటు చేశారు. అందులో బాలినేని శ్రీనివాస్ రెడ్డి కీలక నేత. ఇప్పుడు ఆయనకు గ్రేటర్ రాయలసీమ బాధ్యతలను కట్టబెట్టడం సంచలనంగా మారింది.

**అసంతృప్త నేతలకు గాలం..**


రాయలసీమలో రెడ్డి సామాజిక వర్గంతో పాటు బలిజలు ఎక్కువ. ఆ రెండు సామాజిక వర్గాలపై పవన్ గురిపెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాయలసీమలో 52 నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో కేవలం 7 నియోజకవర్గాలు మాత్రమే వైసీపీ చేతిలో ఉన్నాయి. కూటమి అక్కడ దూకుడుగా ఉంది. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా..



రాయలసీమలో 25 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది.. అంటే ఒక్క రాయలసీమలోనే దాదాపు 80 నియోజకవర్గాలు ఉండనున్నాయి అన్నమాట. వచ్చే ఎన్నికల్లో పొత్తులో భాగంగా రాయలసీమ నుంచి ఎక్కువ సీట్లు తీసుకోవాలని జనసేన భావిస్తోంది. అందుకే బాలినేని శ్రీనివాస్ రెడ్డి ద్వారా వైసీపీ అసంతృప్త నేతలను, సీనియర్ నాయకులను జనసేనలోకి రప్పించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది.

**బాలినేని మంత్రాంగం..**

గతంలో బాలినేని శ్రీనివాస్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో ఉన్న ఆయన జగన్ కోసం తన పదవిని వదులుకొని వైసీపీలో చేరారు. గ్రేటర్ రాయలసీమ పై ఆయనకు మంచి పట్టు ఉంది. పైగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం తెలుసు.. బలహీనత తెలుసు. అందుకే పవన్ కళ్యాణ్ ఆయనకు కీలక బాధ్యతలు కట్టబెట్టారు. అయితే ఇప్పటికే అసంతృప్త నేతలతో బాలినేని చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీకి కచ్చితంగా పనిచేసే నేతలను మాత్రమే జనసేనలోకి తెచ్చేందుకు బాలినేని కీలక చర్చలు జరుపుతున్నారు. వచ్చే నెల నుంచి జనసేనలో చేరికలు పెరిగే అవకాశం ఉంది.



**శ్రీ శ్రీ శ్రీ శీతలా బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవానికి భారీ విరాళాన్ని అందించిన అమరేందర్ రెడ్డి**

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామంలో ఈనెల 25వ తేదీ నుండి జరగబోయే బొడ్రాయి నాభిశిలా ప్రతిష్ట కార్యక్రమాన్ని మహా వైభవంగా నిర్వహించడానికి తన వంతు సహాయంగా పిసిసి కార్యదర్శి కంటెస్టెడ్ ఎమ్మెల్యే యేల్మెటి అమరేందర్ రెడ్డి రెండు లక్షల పదహారువేల రూపాయల విరాళాన్ని అందజేశారు.

# డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు

**యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి**

**రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ టి.శ్రీనివాస్**



గండిపేట(క్రైం మిర్రర్): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ టి.శ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల గుండె, కిడ్నీ, కాలేయం, మెదడుపై పడే దుష్ప్రభావాలు ఎన్నో ఉన్నాయన్నారు. డ్రగ్స్ అలవాటు వల్ల చదువు, ఉద్యోగం, కుటుంబ గౌరవం దెబ్బతింటుందని, యువత భవిష్యత్తు నాశనం అవుతుందని అలా కాకుండా చూసుకోవాలన్నారు. ఒక సారి ట్రై చేస్తే ఏమవుతుందది అనే మాటలకు లొంగవద్దని, నో చెప్పడమే నిజమైన ధైర్యమని అన్నారు.




డ్రగ్స్ వ్యసనం నుంచి బయటపడాలనుకునే వారు సిగ్గుపడకుండా కుటుంబం, పోలీస్ లేదా కౌన్సెలర్ సహాయం తీసుకోవాలని సూచించారు. నషా మక్త్ హెల్ప్ లైన్ 14446 నంబర్ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం డ్రగ్స్ వినియోగం, అమ్మకం, రవాణా చేయడం శిక్షార్హమైన నేరమని సూచించారు. యువతను డ్రగ్స్ బారినుంచి రక్షించడం మా బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్, డిఐ పి.నవీన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ సింధురాణి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిషేధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

**ఒలంపిక్ రన్ ప్రారంభించిన మెదక్ ఎంపి రఘునందన్ రావు**

సిద్దిపేట: డ్రగ్స్ నిషేధానికి ప్రతి జూన్ 23వ తేదీన ఒలింపిక్ డేను నిర్వహిస్తున్నామని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. నశా ముక్త భారత్ కింద మళ్లీ ఈ ర్యాలీ చేపడుతున్నామని పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో డిగ్రీ కళాశాల మైదానంలో ఒలింపిక్ రన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొని మాట్లాడారు. ఈ రన్‌లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ ఒలింపిక్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలను ఎండలో ఉంచడానికి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. డీ విటమిన్ కోసం ఒక ట్యాబ్‌లెట్ వేస్తున్నారు కానీ ఎండలో మాత్రం ఉంచట్లేదని తెలిపారు. యోగాతో ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. యోగా చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులకు యోగా నేర్పించాలని సూచించారు. ఒలింపిక్స్ క్రీడలను తాము చిన్నపుడు చూసేదని.. ఇండియాకి ఎన్ని కప్పులు వచ్చాయో అని తెలుసుకునే వాళ్లమని అన్నారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



# అయోధ్య రామయ్యా..ఏమిటీ అపచారం !

అందరి బంధువయ్యా...అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకులను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పుడే మరచిపోలేదు.అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాల ను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యా యన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి. మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలోఅడుగుడగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయినే చెప్పాలి. ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్థపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరి స్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషపడుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావా లను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మరోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల

తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది.ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టబోమంటూ హామీనిచ్చారు. మొత్తంగా రాముడి పేరు చెప్పి నిర్వాహకులే టోపీ పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చగా మారింది.



## అత్యంత వైభవంగా శ్రీశ్రీశ్రీ గణేశ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

గండిపేట(క్రైం మిర్రర్): బండ్లగూడ జాగీర్ కిస్మత్పూర్ లోని డిఫెన్స్ కాలనీలో వెలిసిన శ్రీశ్రీశ్రీ గణేశ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో రాజేంద్రన గర్ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, బండ్లగూడ మున్సిపల్ పరిధి మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన కొనియాడారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను, కాలనీవాసులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సాగర్ గౌడ్, సురేష్ గౌడ్, పాపయ్య యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## చిత్రపురి కాలనీ వ్యవహారాల నిర్వహణకు పిఐసి కమిటీ నియామకం



గండిపేట(క్రైం మిర్రర్): తెలుగు సినీ వర్కర్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ (ప్రభాకర్ రెడ్డి చిత్రపురి కాలనీ)లో ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గం ఏర్పడే వరకు సొసైటీ పరిపాలనా వ్యవహారాలను నిర్వహించేందుకు కో-ఆపరేటివ్ శాఖ పర్సన్ ఇన్ ఛార్జ్ (పిఐసి) కమిటీని నియమించింది. కో-ఆపరేటివ్ శాఖ అధికారి చంద్రమోహన్ రెడ్డి సమక్షంలో నూతన పిఐసి కమిటీ బాధ్యతలు చేపట్టింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సొసైటీ పరిపాలన, నిర్వహణ, సభ్యులకు సంబంధించిన సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ కమిటీ పర్యవేక్షణ చేయనుంది. పిఐసి కమిటీలో చైర్మన్‌గా డి. స్వామి గౌడ్ ,సభ్యురాలిగా సంయుక్త ప్రభాకర్ రెడ్డి , సభ్యుడిగా డి. రమేష్ బాబు నియమితులయ్యారు. సొసైటీ కార్యకలాపాలు సజావుగా కొనసాగడంతో పాటు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియలను నిబంధనలకు అనుగుణంగా సమన్వయం చేస్తూ కమిటీ తన బాధ్యతలను నిర్వర్తించనుంది.

## గొల్లపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవాలు

### హాజరైన రాజేంద్రనగర్‌నియోజకవర్గ బీజేపీ ఇన్-చార్జీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి

గండిపేట(క్రైం మిర్రర్): రాజేంద్ర నగర్ నియోజక వర్గం శంషాబాద్ మండలం లోని గొల్లపల్లి గ్రామంలో ప్రతిష్టాత్మకంగా ఊరి బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగరంగ వైభవంగా ఇంత ఘనంగా నిర్వహించి గ్రామ పెద్దలకు సభ్యులందరికీ ప్రత్యేకంగా అభినందించి అమ్మవారి చల్లని ఆశీస్సులు దీవెనలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గ్రామస్తులందరూ కలిసి ఐక్యమత్యంగా ఇంత మంచి కార్యక్రమాన్ని పండుగ వాతావరణం నిర్వహించినందుకు మరొకసారి అందరికీ అందర్నీ అభినందించారు. ఈ



యొక్క కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. మూడు రోజులు జరిగే ఈ పండుగ ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని మరొకసారి



గ్రామస్తులందరికి బొడ్రాయి పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎస్సీ న్యాయ పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలి: చాతరాజుల దుర్గాప్రసాద్

**మంచిర్యాల, జూన్ 24 (క్రైమ్ మిర్రర్):** జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రులు శిక్షణ భృతి, న్యాయశాస్త్ర గ్రంథాలు, ఫర్నిచర్ సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 39 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన ఎస్సీ న్యాయశాస్త్ర పట్టభద్రులను మూడు సంవత్సరాల పాటు న్యాయ పరిపాలనలో శిక్షణ నిమిత్తం జిల్లా పరిధిలోని న్యాయ అధికారులకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ. 3 వేల చొప్పున భృతి అందించడంతో పాటు న్యాయశాస్త్ర గ్రంథాలు, ఫర్నిచర్ కొనుగోలుకు ఒకసారి రూ. 50 వేల ఆర్థిక సహాయం




అందజేస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 31 సాయంత్రం 5 గంటలలోపు ఈ-పాస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు బార్ అసోసియేషన్‌లో సభ్యులై ఉండాలని, గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు మీ-సేవ ద్వారా పొందిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాలని సూచించారు. సంబంధిత దరఖాస్తులు, ధ్రువపత్రాలను సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని చాతరాజుల దుర్గాప్రసాద్ తెలిపారు.




## ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ వనంపల్లి జైపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక




గండిపేట(క్రైం మిర్రర్): తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటియూసీ) రాష్ట్ర మున్సిపల్ 4వ మహాసభలు కాటేదాన్‌లోని టిఎల్ఎం గార్డెన్‌లో రెండు రోజుల పాటు మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ వనంపల్లి జైపాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏఐటియూసీ నాయకత్వం తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర నాయకత్వానికి, జాతీయ మున్సిపల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సుబ్బారాయుడుకి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఎన్నుకున్నటువంటి ప్రతినిధులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలోని కార్మికుల సమస్యల మీద నిరంతరం పోరాడుతామన్నారు. తన సొంత ప్రయోజనాల కంటే సంఘం ప్రయోజనమే ముఖ్యంగా భావించి పని చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని అప్పటి వరకు కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మూడవ పిఆర్‌సిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఎన్ఎంఆర్ కార్మికులు మరణిస్తే వారి కుటుంబంలో వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యల మీద నిరంతరం పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో టి.ఆనంద్, సాయిలు, రాజు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 25-6-2026



# గుండాల అంగడి సంతను సందర్శించి,స్వయంగా కూరగాయలు కొనుగోలు చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ఆత్మకూరు(ఎం),జూన్24/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని అంగడి సంతను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో కలిసి సంతలో తిరుగుతూ వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.స్థానికుల విజ్ఞప్తి మేరకు కూరగాయల మార్కెట్ ప్రాంతంలో తగినంత వెలుతురు లేకపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన బీర్ల అయిలయ్య మార్కెట్‌లో అవసరమైన వీధి లైట్లు (స్ట్రీట్ లైట్లు) ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన స్వయంగా అంగడి సంతలో కూరగాయలు కొనుగోలు చేసి సాధారణ ప్రజలతో మమేకమయ్యారు. సంతలో ఉన్న వ్యాపారులు, మహిళలు, రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.తర్వాత ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో ప్రత్యేకంగా మాట్లాడిన బీర్ల అయిలయ్య, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం సక్రమంగా అందుతున్నదా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పథకం అమలుపై మహిళల అభిప్రాయాలను స్వయంగా విని, సేవల నాణ్యతపై వివరాలు సేకరించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. స్థానికులు కూడా ఆయన సంత సందర్శనపై హర్షం వ్యక్తం చేశారు.


# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సహకారం అందిస్తా..

## జ్యోతి విద్యాసంస్థల చైర్మన్ రఘుపతి..



కేశంపేట (క్రైమ్ మిర్రర్):విద్యలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు తమ వంతు సహకారాన్ని అందిస్తానని జ్యోతి విద్యాసంస్థల చైర్మన్ రఘుపతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందినమాల యాదయ్య కుమార్తె అనూష  బయోటెక్నాలజీ విభాగంలో తిరుపతిలో పీహెచ్‌డీ సీటు సాధించింది. ఈ సందర్భంగా ఆమె ను శాలువాతో ఘనంగా సన్మానించి ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించేందుకు జ్యోతి విద్యాసంస్థల చైర్మన్ దిద్దెల రఘుపతి ముందుకొచ్చారు.విద్యార్థిని పరిశోధనను మరింత సులభతరం చేయడానికి అవసరమైన ల్యాప్‌టాప్‌ను అందజేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని అత్యున్నత విద్యలో ప్రవేశం సాధించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు దిద్దెల రఘుపతికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్వాల ప్రకాష్ గౌడ్, బాలాజీ, నిర్మల్, పురుషోత్తం, కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


# సర్వరాజ్‌పూర్‌లో ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం...!



**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** ? పశువులను ముద్దచర్మ వ్యాధి (ాబఎజూఎ ాూఆఅ ఱఅంఝంవ) బారి నుండి కాపాడేందుకు పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ నత్తి రాజుకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామంలోని ఆవులు, ఎడ్లు, గేదెలు మరియు దూడలకు రక్షణ కవచంగా నిలవనుంది.

**వ్యాధి లక్షణాలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ కొమ్మెర మనీషా పటేల్ మాట్లాడుతూ, ముద్దచర్మ వ్యాధి వైరస్ ద్వారా సోకే ప్రమాదకరమైన అంటువ్యాధి అని వివరించారు. ముఖ్యంగా దోమలు, ఈగలు, పేనులు వంటి కీటకాల ద్వారా ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుందని పేర్కొన్నారు.
- వ్యాధి సోకిన పశువులలో కనిపించే

**ప్రధాన లక్షణాలు:**

- తీవ్రమైన జ్వరం రావడం.
- కళ్లు మరియు ముక్కు నుంచి స్రావాలు రావడం.
- శరీరంపై గట్టి ముద్దలు (గడ్డలు) ఏర్పడటం.
- ఆకలి తగ్గడం మరియు పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం.

**రైతులకు సూచనలు**

- వ్యాధి బారిన పడితే పశువుల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా రైతులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని, అందుకే ప్రతి రైతు అప్రమత్తంగా ఉండి తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని డాక్టర్ మనీషా పటేల్ సూచించారు. పశువుల కొట్టాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు, ఈగల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నత్తి రాజుకుమార్, ఉపసర్పంచ్ బండారి భూమేష్, పశువైద్యాధికారి డా. కొమ్మెర మనీషా పటేల్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది కట్కం రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## పాలకవీడు మండల ఎస్ఐ కోటేష్

**క్రైమ్ మిర్రర్, హుజూర్ నగర్(పాలకీడు) :** విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పాలకవీడు మండల ఎస్ఐ కోటేష్ అన్నారు. పాలకవీడు గ్రామ పరిధిలోని కేజీబీవీ  పాఠశాలలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థినులకు డ్రగ్స్ పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాటు వల్ల జరిగే నష్టాలను, వాటి వల్ల కలిగే భయంకరమైన పరిణామాలను విద్యార్థులకు వివరంగా వివరించారు. యువత, విద్యార్థుల జీవితాలను డ్రగ్స్ ఎలా నిర్వీర్యం చేస్తాయో ఉదాహరణలతో పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలని, చదువుపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు.  విద్యార్థులు సమాజంలో జరుగుతున్న మంచి చెడులను గమనిస్తూ మెలకువలతో ముందుకు వెళ్లాలనిఅన్నారు.నేటి యువతరం చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం..

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఎమ్మెల్యే సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను  లేమామిడి  గ్రామ సర్పంచ్ సులోచన శీను  బుధవారం ప్రారంభించారు. రూ.5 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో గ్రామ ప్రాథమిక పాఠశాల నుంచి కబ్రస్థాన్ వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నారు. రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజల రాకపోకలకు సౌలభ్యం కలుగుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దిద్దెల రఘుపతి,ప్రకాష్ గౌడ్,బాలాజీ,కావాలి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి,చాకలి వెంకటయ్య,బాల కిష్టయ్య,రాజశేఖర్,పురుషోత్తం, తాహెర్,వజిత్,నిర్మల్,యాదయ్య గౌడ్,ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య,కరోబార్ బైండ్ల యాదయ్య, మాల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజుల సంక్షేమ కోసం ప్రభుత్వం కృషి

## కాంగ్రెస్  పార్టీ మండల అధ్యక్షుడు రమేష్.



కేశంపేట (క్రైమ్ మిర్రర్): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజుల సంక్షేమం కోసం ఎల్లప్పుడు కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనుమగల రమేష్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని పోమాలపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం సభ్యులు తమ సొంత నిధులతో నిర్మించిన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ఎల్లప్పుడూ తోడ్పాటున అందిస్తున్నారన్నారు. ముదిరాజ్ సంఘం సభ్యులు ప్రభుత్వ నుంచి ఏవైనా నిధులు కావాల్సి వస్తే తమ దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, చింతకొండపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్, ముదిరాజ్ సంఘం కమిటీ చైర్మన్ లింగం,ఉపాధ్యక్షులు పొమాల్ పల్లి లింగం,సంఘం సెక్రటరీ శేఖర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రయ్య ,పెద్ద లింగం,మల్లేష్,డీలర్ వెంకటేష్ తదితరులు  పాల్గొన్నారు,

# మల్లన్నపేట జడ్పీహెచ్ఎస్‌లో 'యాంటీ నార్కోటిక్స్' అవగాహన సదస్సు..!



**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ వేదికగా బుధవారం 'యాంటీ నార్కోటిక్స్ మరియు డ్రగ్స్ అవగాహన' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గొల్లపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం. కృష్ణ సాగర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు.

**యువతకు దిశానిర్దేశం**

ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం "నషా ముక్త్ భారత్ అభియాన్"లో భాగంగా ఈ అవగాహన కల్పించినట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలవ్వడం వల్ల విద్యార్థుల జీవితాలు నాశనం కావడమే కాకుండా, శారీరక, మానసిక, ఆర్థిక మరియు సామాజికంగా తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించి, బంగారు భవిష్యత్తు కోసం చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

**పోలీసులకు సహకరించండి: ఎస్ఐ**

- సమాజంలో డ్రగ్స్ రహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ పిలుపునిచ్చారు.
- ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను విక్రయించినా, కొనుగోలు చేసినా, నిల్వ చేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.
- సమాచారం ఇచ్చే వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన భరోసా ఇచ్చారు.
- యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీవో అధికారి వెంకన్న మృతి ఘటనపై సమగ్ర విచారణ

ప్రమాద స్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించిన విచారణ అధికారి

ప్రత్యక్ష సాక్షులు, లారీ డ్రైవర్, యజమాని వాంగ్మూలాల నమోదు

సీసీటీవీ ఫుటేజీలు, బొగ్గు లోడింగ్ రికార్డుల పరిశీలన

ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పణ?





**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి ఆర్టీవో కార్యాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్‌ను విచారణ అధికారిగా నియమించింది. విచారణలో భాగంగా బుధవారం భూపాలపల్లికి చేరుకున్న చంద్రశేఖర్ గౌడ్ ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ముందుగా ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులతో సమావేశమై, సంఘటనపై ఇప్పటివరకు చేపట్టిన ప్రాథమిక దర్యాప్తు వివరాలను సీఐ కరుణాకర్ రావు, ఎస్‌ఐ అశోక్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాదానికి సంబంధించిన లారీ డ్రైవర్, లారీ యజమాని, హార్వెస్టర్ డ్రైవర్‌లను విడివిడిగా విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. తర్వాత జెన్‌కో అధికారులతో సమావేశమై ప్రమాదం జరిగిన రోజు లారీలో తరలించిన బొగ్గు వివరాలను సేకరించారు. అనంతరం ప్రమాద స్థలాన్ని సందర్శించిన విచారణ అధికారి, అక్కడ నలుగురు ప్రత్యక్ష సాక్షులను విచారించారు. సంఘటన జరిగిన తీరును అర్థం చేసుకునేందుకు సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించి ప్రమాద పరిస్థితులను విశ్లేషించారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను కూడా పరిశీలించారు. తదుపరి బొగ్గు లోడింగ్ పాయింట్ అయిన తాడిచర్లకు వెళ్లి ఓపెన్‌కాస్ట్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రమాదానికి గురైన లారీకి సంబంధించిన లోడింగ్ రికార్డులను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ విచారణ సందర్భంగా మోటారు వాహన తనిఖీ అధికారులు జంగ్లీ శ్రీనివాస్, శివపల్లి శ్రీనివాస్, బారగాడి శ్రీనివాస్, ఘన్‌పూర్ సీఐ కరుణాకర్ రావు, ఎస్‌ఐ అశోక్, భూపాలపల్లి ఏఎంవీఐలు ఫాహిమా సుల్తానా, సుందర్‌లాల్, శ్రీనివాస్ తదితరులు విచారణ అధికారితో కలిసి పాల్గొన్నారు. ఘటనకు సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించిన విచారణ అధికారి చంద్రశేఖర్ గౌడ్, ఒకటి లేదా రెండు రోజుల్లో ప్రాథమిక నివేదికను రాష్ట్ర రవాణా కమిషనర్‌కు సమర్పించనున్నట్లు సమాచారం.



## ఎస్ఐఆర్ పై అవగాహన సదస్సు..

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవెల్ అధికారులకు ఎంపీడీవో సమావేశ మందిరంలో తహసిల్దార్ రాజేందర్ రెడ్డి అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు ను భాగస్వామ్యం చేయాలన్నారు. ఎస్ ఐ ఆర్ కి సంబంధించిన మెటీరియల్ ను అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపతహసిల్దార్ గీత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతర కృషి : సర్పంచ్ హసీనా

పాఠశాల అభివృద్ధి పనులు, నిధుల వినియోగంపై సమీక్ష

సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న సర్పంచ్ హసీనా బాను

విద్యార్థుల సంక్షేమానికి పారదర్శక వ్యవస్థ అవసరం



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, నిధుల వినియోగంపై సమీక్షించేందుకు ఈ సోషల్ ఆడిట్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సోషల్ ఆడిట్ ప్రత్యేక అధికారుల బృందం హాజరై పాఠశాలలో అమలవుతున్న పలు అంశాలను పరిశీలించింది. పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ నిధుల వినియోగంపై అధికారులు సమగ్రంగా వివరాలు సేకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ హసీనా బాను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సోషల్ ఆడిట్ ఒక ముఖ్యమైన ప్రక్రియ అని అన్నారు. పాఠశాలల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు గ్రామ పంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ప్రత్యేక అధికారులు పాఠశాల రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి సూచనలు, అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ శీతలా బొడ్రాయి ప్రతిష్టా మహోత్సవము

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామంలో ఈనెల 25వ తేదీ నుండి జరగబోయే బొడ్రాయి నాభిశిలా ప్రతిష్టలో భాగంగా గ్రామ ప్రజల పెద్దలు ఆధ్వర్యంలో బొడ్రాయి సమీపంలో విలేకరుల సమావేశంలో గ్రామ పెద్దలు మాట్లాడుతూ బాలాపూర్ గ్రామంలో బొడ్రాయి పండగను గ్రామంలోని అందరి సహాయ సహకారాలతో ఈ పండుగను జరుపుకోవడం మాకెంతో సంతోషమని అలాగే ఇప్పుడు బొడ్రాయి పున ప్రతిష్ట చేయడం మా అందరి అదృష్టంగా భావిస్తూ రేపటినుండి ఆదివారం వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



# ఓటరు జాబితా సవరణలో బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర





**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** ?పట్టణంలోని వి.కె.బి. (VKB) ఫంక్షన్ హాల్‌లో 'ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితా--2026' (SIR) కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బోగ శ్రావణి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**కార్యకర్తలకు కీలక పిలుపు**

ఈ సందర్భంగా డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏ 2) అత్యంత కీలక బాధ్యతను కలిగి ఉన్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా, ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా చూడటంతో పాటు, ప్రతి అర్హుడైన పౌరుడి పేరు జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు విస్తృతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**సమావేశంలో ప్రధానంగా చర్చించిన అంశాలు:**

**క్షేత్రస్థాయి పర్యవేక్షణ:** ప్రతి బూత్‌లో ఓటర్ల నమోదును పర్యవేక్షించి, కొత్త ఓటర్లను చేర్పించడంపై దృష్టి సారించాలి.

**సమన్వయం:** బూత్ స్థాయి నాయకులు, శక్తికేంద్ర బాధ్యులు సమన్వయంతో పనిచేసి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలి.

**బాధ్యత:** ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు, జిల్లా మరియు మండల స్థాయి పదాధికారులు, కౌన్సిలర్లు, వివిధ మోర్చాల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, శక్తికేంద్ర బాధ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు సహకరించాలి: అదనపు కలెక్టర్ బి.ఎస్. లత...!

**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ ప్రక్రియలో జగిత్యాల జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

**ముఖ్యమైన షెడ్యూల్ మరియు వివరాలు**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై అదనపు కలెక్టర్ కీలక సూచనలు చేశారు:

**ఇంటింటి సర్వే:** జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, వాటిని తిరిగి సేకరిస్తారు.

**ముసాయిదా ప్రచురణ:** జూలై 31న ముసాయిదా ఓటరు




జాబితా విడుదలవుతుంది.

**అభ్యంతరాల స్వీకరణ:** జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు.

**పరిష్కారం:** సెప్టెంబర్ 28 నాటికి అభ్యంతరాలన్నీ పరిష్కరిస్తారు.

**తుది ఓటరు జాబితా:** అక్టోబర్ 1, 2026న తుది జాబితా ప్రచురించబడుతుంది.

**అర్హులైన వారందరికీ ఓటు హక్కు**

అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, "అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుండి మినహాయించబడకూడదు, అదే సమయంలో అనర్హులు చేరకుండా జాగ్రత్త వహించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం" అని స్పష్టం చేశారు. ఓటర్ల మార్పులు, చేర్పుల కోసం ఫారం-8ని, కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6ని వినియోగించాలని సూచించారు. ఈ ప్రక్రియలో బీఎల్ఏలు (BLAs) చురుగ్గా పాల్గొని, బీఎల్‌వోలకు సహకరించాలని కోరారు. అలాగే, ఎన్ఎస్ఎస్ (మీూ) మరియు ఎన్సీసీ (చీజజ) వాలంటీర్ల సేవలను కూడా వినియోగిం చుకోనున్నట్లు తెలిపారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా నిబంధనల ప్రకారమే ఈ కార్యక్రమం జరుగుతుందని, గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే నా ధ్యేయం

- మండల,పట్టణ అధ్యక్షుల ప్రమాణ స్వీకార మహోత్సవం
- మున్సిపల్ అధ్యక్షులుగా కాసర్ల శ్రీనివాసరెడ్డి ప్రమాణస్వీకారం...
- మండల అధ్యక్షులుగా బోయ దేవేందర్ ప్రమాణ స్వీకారం..
- ప్రజలకు దగ్గరగా ఉండాలి, ప్రజల మాటను విని గౌరవించాలి...
- ఓడిన గెలిచిన ప్రజల మధ్యనే ఉండి ఆదుకోవాలి...
- నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు అందర్నీ సమన్వయం చేసుకోవాలి
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి




**చౌటుప్పల్,జూన్ 24, క్రైమ్ మిర్రర్ :** నాయకులు ఓడిన గెలిచిన ప్రజల మధ్యనే ఉండి ఆపదొచ్చిన, సాపదొచ్చిన ఆదుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచించారు. బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రం, లక్కారం గ్రామ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో మున్సిపల్ అధ్యక్షులుగా కాసర్ల శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షులుగా బోయ దేవేందర్ ల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై వారి చేత ప్రమాణస్వీకారాన్ని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాయకులు ప్రజలకు దగ్గరగా ఉండి ప్రజల మాటను విని గౌరవించాలన్నారు. అప్పుడే ప్రజల గుండెల్లో నాయకుడిగా మనగలుగుతామని అన్నారు. అంతేకాకుండా ప్రతి నాయకుడు పార్టీని బలోపేతం చేయాలిని,ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతిపక్షంలో ఉన్న,అధికార పక్షంలో ఉన్న నియోజకవర్గ అభివృద్ధిలో మాత్రం రాజీ పడేది లేదని, మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. నూతనంగా ఎంపికైన చౌటుప్పల్ మండల, పట్టణ అధ్యక్షులను ఇరువురిని అభినందించారు. గ్రామ, మండల, పట్టణ, నియోజకవర్గస్థాయిలో అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే సరైన ఫలితాలు వస్తాయని తెలిపారు. 2018 ఎన్నికల్లో మొత్తం టిఆర్ఎస్ పార్టీ గెలిస్తే మునుగోడు లో మాత్రం కాంగ్రెస్ పార్టీ గెలిచిందని గుర్తు చేశారు. రాజకీయాలలో ఉండేవారు ఓపికతో పనులు చేసుకుంటూ అందరూ కష్టపడుతూ పోతే పదవులు వస్తాయని అన్నారు. నాయకుడనేవాడు వ్యక్తిగతంగా మంచివాడ కాదా, ప్రజలకు అందుబాటులో ఉంటున్నాడా లేదా,ప్రజలకు మంచి పనులు చేస్తున్నాడా లేదా అని ప్రజలు సునిశితంగా గమనిస్తున్నారని అన్నారు. గెలిచిన తర్వాత ప్రవర్తనలో మార్పు వస్తే వచ్చేసారి ప్రజల తీర్పు వ్యతిరేకంగా ఉంటుందని గుర్తు చేశారు. ప్రతి నాయకుడు ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు.నూతనంగా ఎన్నికైన చౌటుప్పల్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్ , చౌటుప్పల పట్టణ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి లు తమకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ రాజగోపాల్ రెడ్డిని శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగదాల పావని రమేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,నాయకులు పబ్బు రాజ్ గౌడ్, మోగుదాల రమేష్ గౌడ్, స్థానిక కౌన్సిలర్లు,మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మాజీ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నర్సింహ గౌడ్,మండల ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలి



**కేశంపేట ( క్రైమ్ మిర్రర్):** ఉప సర్పంచ్ ల న్యాయమైన డిమాండ్ సాధనకు తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న భారీ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేశంపేట మండల అధ్యక్షుడు మహమ్మద్ షకీల్ బుధవారం పిలుపునిచ్చారు. తమ హక్కుల సాధన కోసం మండలంలోని అన్ని గ్రామాల ఉపసర్పంచులు ధర్నా కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

## సూర్య గిరి ఎల్లమ్మ ఆలయంలో వింత పూజలు...!

తన భర్త తన నుండి దూరం చెయ్యొద్దని భర్త ఫోటో పెట్టీ పూజలు చేసిన ఓ భక్తురాలు

పూజలు చేస్తుండగా చూసి ఆందోళన చేందిన భక్తులు





**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం మండలం రావిర్యాలలో స్వయంభువై వెలిసిన శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో వింత ఘటన చోటు చేసుకుంది..ప్రతి మంగళవారం అమ్మవారి దర్శనానికి వేలాదిగా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.అదే తరుణంలో ఓ భక్తురాలు తన భర్త మరొక మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని తనకు దక్కకుండా చేస్తుందని..ఆవేదనతో భర్త పోలో,మరొక మహిళ ఫోటో తోపాటు ఒక తాడు పసుపు కుంకుమ వేసి పూజ చేస్తుండగా అక్కడికి వచ్చిన భక్తులు ఆందోళన చెందారు..వెంటనే ఆలయ సిబ్బందికి సమాచారమివ్వడంతో వెంటనే ఆమెను బయటకు పంపించారు.ఆలయ ప్రాంగణంలో ఎవరైనా భక్తులకు ఇబ్బంది కలిగించే అసాంఘిక కార్యక్రమాలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో తెలిపారు.




## డ్రగ్స్ వినియోగం.. భవిష్యత్తు అంధకారం

### కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్, నేరేడుచెర్ల :** డ్రగ్స్, గంజాయిలతో భవిష్యత్ అంధకారం అవుతుందని కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.నేరేడుచర్ల మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం వల్ల కలిగే నష్టాలు, దుష్పరిణామాలు ,చట్టపరమైన చర్యలపై అవగాహన సదస్సు నేరేడుచర్ల ఎస్ఐ సైదిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కోదాడ డీఎస్పీ ఆర్. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిదేశం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాల అలవాటు వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య నష్టాలను డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు వివరించారు. క్షణికానందం కోసం వ్యసనాల బారిన పడి బంగారు భవిష్యత్తును, జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడితే చట్టపరంగా కఠినమైన శిక్షలు ఉంటాయని, క్రిమినల్ కేసులు నమోదైతే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతారని స్పష్టం చేశారు. చదువుపై దృష్టి పెట్టి సమాజంలో ఉన్నత స్థానాలు అధిరోహించాలని, ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ వెంకట రమణ , బోధన సిబ్బంది ,పాల్గొన్నారు.

## సింగరేణి ఈఅండ్ఎమ్ జీఎం రఘురామిరెడ్డికి ఘన సన్మానం

**మందమర్రి, జూన్ 24 (క్రైమ్ మిర్రర్) :** సింగరేణి సంస్థలో ఈఅండ్ఎమ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ త్వరలో పదవీ విరమణ చేయనున్న వై. రఘురామిరెడ్డికి బుధవారం మందమర్రి ఏరియాలో ఘన సన్మానం నిర్వహించారు.స్థానిక జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణతో పాటు ఉన్నతాధికారులు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ రఘురామిరెడ్డి సుదీర్ఘ సేవాకాలంలో సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, అంకితభావం తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం జీ.ఎల్. ప్రసాద్, కేకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి రాంబాబు, కేకే ఏజెంట్ కాదిర్, ఎస్కే ఏజెంట్ సంతోష్‌కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## సుర్వి నరసింహ గౌడ్ ను సన్మానించిన ఎమ్మెల్యే

**చౌటుప్పల్,జూన్ 24, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షులుగా సేవలందించి పదవి విరమణ పొందిన సుర్వి నరసింహా గౌడ్ ను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. మున్సిపల్ అధ్యక్షులుగా సుర్వినరసింహ గౌడ్ పార్టీకి అందించిన సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మందమర్రి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

### పల్స్ పోలియోపై వైద్య సిబ్బందితో సమీక్ష

### జిల్లాలో 76,367 మంది చిన్నారులకు చుక్కల మందు లక్ష్యం

**మందమర్రి, జూన్ 24 (క్రైమ్ మిర్రర్):** ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. బుధవారం మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనే సిబ్బంది, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. వైద్య, విద్య, మున్సిపల్, ఐసీడీఎస్ తదితర శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో సిబ్బందికి శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు.జిల్లాలో 76,367 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు.ఇందుకోసం 459 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి, 1,836 మంది సిబ్బందిని విధుల్లో నియమించినట్లు చెప్పారు. ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని చిన్నారుల వివరాలను సేకరించి తొలి రోజే 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన వారికి జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేయాలని ఆదేశించారు.నవజాత శిశువులు, జ్వరం లేదా జలుబుతో బాధపడుతున్న పిల్లలు కూడా పోలియో చుక్కలు తీసుకోవచ్చని తెలిపారు. అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు,



అసంక్రమణ వ్యాధుల నియంత్రణ చర్యలు, మందుల నిల్వలను పరిశీలించారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచడంతో పాటు స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు.బీపీ, మధుమేహం వంటి అసంక్రమణ వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు అమర్చాలి

## పరిగి సర్కిల్ ఇన్స్పెక్టర్ కొండల్ రెడ్డి కుల్కచర్ల ఎస్సై రమేష్ కుమార్



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ప్రమాదాలను నివారించాలంటే హెచ్చరిక బోర్డులను తప్పనిసరి అమర్చాలని పరిగి సర్కిల్ ఇన్స్పెక్టర్ కొండల్ రెడ్డి కుల్కచర్ల ఎస్సై రమేష్ కుమార్ ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం పరిధిలోని ఘనాపూర్ టీ జంక్షన్ రోడ్డులో మంగళవారం జరిగిన ప్రమాద స్థలమును బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాహనదారులు వేగ నియంత్రణ కోసం రోడ్డుపై రంబ్లర్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని రోడ్డు మూల మలుపుల దగ్గర హెచ్చరిక బోర్డులను అమర్చాలని వారు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి వాన దారుడి బాధ్యత అని ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా కుల్కచర్ల పోలీసులు కొన్ని సూచనలు చేశారు. వాహనదారులు జంక్షన్ క్రాస్ రోడ్డు గ్రామాల సమీపంలో తప్పనిసరిగా వాహన వేగాన్ని తగ్గించాలని, రోడ్డు మలుపు టీ జంక్షన్లో యూటర్న్ ల వద్ద జాగ్రత్తగా వాహనం నడపాలని, ద్విచక్ర వాహనదారులు వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని, ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని అలాగే మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడుపుతూ సోషల్ మీడియాలో మెసేజ్లు పంపుతూ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడప రాదని ఆ సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని, ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైటింగ్ చేయరాదని, వాహనదారులు ఓవర్ స్పీడ్ రాక్ డ్రైవింగ్ అలాగే ఓవర్ టేకింగ్ చేయరాదని, ఎదురుగా వస్తున్న వాహనాలకు అవకాశం ఇవ్వాలని, ట్రాఫిక్ నియంత్రణను పాటించాలని, రాత్రివేళల్లో ఎదురుగా వస్తున్న వాహనానికి డిప్పర్ లైట్లు ఉపయోగించాలని, డ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు అలసటగా ఉన్నప్పుడు లేదా నిద్రమత్తులో ఉన్నప్పుడు వాహనం నడపరాదని, వాహనదారులకు సూచనలు చేశారు. వాన దారులు రోడ్డుపై డ్రైవింగ్ చేసేటప్పుడు హెచ్చరిక బోర్డులు ట్రాఫిక్ పోలీసులు సూచనలు తప్పనిసరిగా పాటించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులు ఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# చిరకాల మిత్రుడికి కన్నీటి వీడ్కోలు

## సీహెచ్ సత్యనారాయణ అంతిమ యాత్రలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భావోద్వేగ నివాళి

**కూకట్ పల్లి, జూన్ 24 (క్రైమ్ మిర్రర్):** కూకట్‌పల్లి నియోజకవర్గ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన మాజీ కౌన్సిలర్, మోతీనగర్--అవంతినగర్--తోట ప్రాంతాల అభివృద్ధికి విశేష సేవలు అందించిన సీహెచ్ సత్యనారాయణ ఆకస్మిక మరణం స్థానిక ప్రజలను, రాజకీయ వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. చిరకాల మిత్రుడు, రాజకీయ సహచరుడైన సత్యనారాయణతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. జీవితాంతం ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతిమ యాత్ర ప్రారంభం నుంచి చివరి వరకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వెంట నడుస్తూ తన స్నేహబంధాన్ని, మానవీయ విలువలను మరోసారి చాటిచెప్పారు. పాడె మోసి అంతిమ యాత్రలో పాల్గొన్న ఆయన, పీఆర్ నగర్ స్మశాన వాటికలో జరిగిన అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నమ్మిన వారిని ఎప్పటికీ మరవకుండా, కష్టసమయంలో అండగా నిలబడే తన స్వభావాన్ని మరోసారి నిరూపించారని పలువురు నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. సత్యనారాయణ అంతిమ యాత్రలో కోఆర్డినేటర్ సతీష్ ఆరోరా, మాజీ కార్పొరేటర్లు తూము శ్రవణ్, మందడి శ్రీనివాసరావు, ఆవుల రవీందర్ రెడ్డి, మాధవరం రంగారావు, ముద్దం నర్సింహ యాదవ్, పగుడాల బాబూరావు, సబిహా గౌసుద్దీన్, మాజీ కౌన్సిలర్ మక్కల నర్సింగరావు, సీనియర్ నాయకులు వీరారెడ్డి, కృష్ణారెడ్డి, అంబటి శ్రీనివాస్, తిరుపతి, అయిలయ్య, సత్యం, జగన్, కన్నయ్య, అబ్బులు, పాతూరు గోపి, బొట్టు విష్ణు, సాయి శ్రీనివాస్, నాని, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని సీహెచ్ సత్యనారాయణకు ఘన నివాళులు అర్పించారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే సత్యనారాయణ మరణం మోతీనగర్, అవంతినగర్, తోట ప్రాంత ప్రజలకు తీరని లోటని పలువురు అభిప్రాయపడ్డారు. ఆయన సేవలను ప్రజలు చిరకాలం స్మరించుకుంటారని నివాళుల సందర్భంగా పేర్కొన్నారు.

# యువతే పార్టీకి వెన్నెముక.. కష్టపడి పనిచేస్తే గుర్తింపు తప్పక లభిస్తుంది

## టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్




**కూకట్ పల్లి, జూన్ 24 (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త తన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తే, కష్టాన్ని గుర్తించి అవకాశాలు కల్పించే బాధ్యతను పార్టీ తీసుకుంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్ పల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సలీం ఆధ్వర్యంలో బుధవారం కెపిహెచ్‌బీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ యువ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ రాజకీయ పార్టీకి అయినా యువతే వెన్నెముకగా నిలుస్తుందని, పార్టీ బలోపేతంతో పాటు దేశ అభివృద్ధిలోనూ యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు. యువ నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందుండాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో కష్టపడి పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చని, అలాంటి సేవా కార్యక్రమాల ద్వారానే భవిష్యత్తులో మరిన్ని రాజకీయ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

తాను కూడా పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేయడం వల్లే నేడు ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేసిన బండి రమేష్, పదవులు అడిగి పొందేవి కావని, పనితీరు ఆధారంగానే పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని అన్నారు. యువత తమ శక్తి సామర్థ్యాలను ప్రజాసేవకు వినియోగించి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.రానున్న రోజుల్లో పార్టీ విజయానికి ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని సూచించిన ఆయన, నియోజకవర్గంలో బండి రమేష్, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ "త్రిబుల్ ఆర్" స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ విజయానికి నేటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని పిలుపునిచ్చారు. యువత ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విలువలను గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు విస్తృతంగా తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి భవ్య, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఇంచార్జి రామ్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రమ్య, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక అజయ్‌తో పాటు పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ సంఘాలు ప్రజల సంక్షేమం, కాలనీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలి

## బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, ఎమ్మెల్యే కె. పి. వివేకానంద గౌడ్



**కుత్బుల్లాపూర్, జూన్ 24 (క్రైమ్ మిర్రర్):** సంక్షేమ సంఘాలు ప్రజల సంక్షేమం, కాలనీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. రాజీవ్ గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద్ ని బుధవారం ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, ప్రజల సంక్షేమం మరియు కాలనీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తామని కమిటీ సభ్యులుకు ఎమ్మెల్యేలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కుంచల అజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు టి. విక్రమ్, కోశాధికారి పి. సంపత్ రెడ్డి, కాలనీ ప్రముఖులు చింతకింది వెంకటేష్, మహిపాల్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు వెంకటేష్ గౌడ్, రమేష్, సర్వన్, బ్రహ్మ, సుబ్బారావు, రాజేష్ కుమార్, సతీష్, టి. శ్రీనివాస్, అవినాష్, జి. రాజేందర్ రెడ్డి, సిహెచ్ అశోక్, ఎమ్. వేణుగోపాల్, షేక్ ముబిన్, టి. రవి కుమార్, ఫణీంద్ర, నవీన్, ఎన్. అవినాష్ మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చీరల పంపిణీ పేరుతో మహిళల గౌరవానికి భంగం కలిగించొద్దు

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్ పల్లి, జూన్ 24 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న చీరల పంపిణీ కార్యక్రమం మహిళల సంక్షేమం కోసం కాకుండా అనవసర వివాదాలకు కేంద్రబిందువుగా మారుతోందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చీరల పంపిణీ పేరుతో మహిళలకు ఐరిష్ పరీక్షలు నిర్వహించడం, ఆధార్ కార్డులను సేకరించడం, చీరలను ఒంటిపై కప్పించి ఫొటోలు తీయడం వంటి చర్యలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయని ఆయన విమర్శించారు. మహిళల గౌరవం, వ్యక్తిగత గోప్యతను దెబ్బతీసే విధంగా కార్యక్రమాన్ని అమలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత ఉండాలని, కానీ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసే విధానాలు అవలంబించడం సరైంది కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా రాష్ట్రంలోని మహిళలందరికీ అందించామని గుర్తు చేశారు. అప్పుడు ఎలాంటి బయోమెట్రిక్ లేదా ఐరిష్ ధృవీకరణ ప్రక్రియలు లేకుండానే పథకం విజయవంతంగా అమలైందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చీరల పంపిణీ కార్యక్రమంలో ఐరిష్ పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఏమిటో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఆధార్ వివరాలను సేకరించడం, మరోవైపు ఐరిష్ ధృవీకరణ చేయడం, అనంతరం చీరను కప్పుకుని ఫోటోలు తీయించడం వంటి చర్యలను ప్రభుత్వం ఎలా సమర్థిస్తోందో సంబంధిత అధికారులు వెంటనే వివరణ ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా, చీరల పంపిణీ బాధ్యతలను పొదుపు సంఘాలు, సమైక్య సంఘాలకు అప్పగించడం, ఒకే రకమైన చీరలను పంపిణీ చేసి వాటిని ధరించి సమావేశాలకు హాజరు కావాలని సూచించడం వంటి అంశాలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు. సంక్షేమ పథకాల పేరుతో మహిళలను రాజకీయ ప్రచార కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం తగదని, మహిళల గౌరవాన్ని కాపాడే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలని మాధవరం కృష్ణారావు కోరారు. మహిళల సంక్షేమం నిజమైన లక్ష్యమైతే, వారికి గౌరవప్రదంగా, ఎలాంటి అవమానకరమైన నిబంధనలు లేకుండా చీరలను పంపిణీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు."మహిళలకు చీరలు ఇవ్వడం స్వాగతించదగినదే... కానీ వారి గౌరవాన్ని దెబ్బతీసే విధానాలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కావు" అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు.



# హెచ్ఎండీఏ మేడిపల్లి లేఅవుట్ ఈ-వేలానికి విశేష స్పందన

## గరిష్ఠ బిడ్ చదరపు గజానికి 80,000

హైదరాబాద్ (క్రైం మిర్రర్): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మేడిపల్లి లేఅవుట్‌లోని 68 నివాస ప్లాట్లకు నిర్వహించిన మూడో దశ ఈ-వేలం విజయవంతంగా పూర్తయింది. ఈ వేలానికి గృహ కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల నుండి విశేష స్పందన లభించింది. హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో బిడ్డర్లు పాల్గొనడం ద్వారా హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్లపై మార్కెట్ విశ్వాసం బలంగా ఉందని, అలాగే సక్రమ ప్రణాళికతో రూపొందించిన నివాస ప్రాజెక్టులపై డిమాండ్ పెరుగుతున్నదని స్పష్టమైంది. మొత్తం 68 ప్లాట్లలో 63 ప్లాట్లు వేలం ద్వారా విక్రయించబడ్డాయి. ఈ వేలంలో గరిష్ఠంగా చదరపు గజానికి 80,000 బిడ్ లభించగా, సగటు బిడ్ ధర చదరపు గజానికి 56,260గా నమోదైంది. దీని ద్వారా సుమారు 120 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది మేడిపల్లి ప్రాంత ఆకర్షణను మరింత స్పష్టం చేస్తోంది. పలు ప్లాట్లకు అనేక బిడ్లు రావడంతో బిడ్డర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ విజయవంతమైన ఈ-వేలం హైదరాబాద్ తూర్పు అభివృద్ధి కారిడార్‌లో మరింత అభివృద్ధి, పెట్టుబడులను వేగవంతం చేస్తుందని భావిస్తున్నారు.

# దేవినగర్‌లో భక్తి వెల్లువలు.. కట్ట మైసమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం

## ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు



**కూకట్ పల్లి, జూన్ 24 (క్రైమ్ మిర్రర్):** కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దేవినగర్‌లో వెలసిన గ్రామదేవత శ్రీ నల్లచెరువు కట్ట మైసమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. వేద మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలు, హోమాలు, మంగళవాయిద్యాల మధ్య జరిగిన ఈ మహోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కట్ట మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ “కట్ట మైసమ్మ తల్లి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పంటలు పుష్కలంగా పండాలని కోరుకున్నాను. రైతుల కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరియాలని, వ్యవసాయం లాభసాటిగా మారాలని అమ్మవారిని ప్రార్థించాను. కూకట్‌పల్లి ప్రజలకు రక్షణగా నిలుస్తూ నల్లచెరువు కట్టను కాపాడుతున్న మైసమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను” అని తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, గ్రామ దేవతల పట్ల ప్రజల విశ్వాసం, భక్తి సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, ఇటువంటి ఆలయాలు ప్రజల ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేవినగర్ ప్రజలు ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక నాయకులు, భక్తులు, దేవినగర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోగా, భక్తులు అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించి ఆశీస్సులు పొందారు. కట్ట మైసమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం దేవినగర్‌లో భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచి స్థానిక ప్రజల్లో విశేష ఉత్సాహాన్ని నింపింది.

# రంగారెడ్డి వికారాబాద్ జిల్లాల సిపిఐ రాజకీయశిక్షణ తరగతులను విజయవంతం చేయండి

**సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య**



గండిపేట(క్రైం మిర్రర్): భారత కమ్యూనిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా, వికారాబాద్ జిల్లా సిపిఐ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు జూన్ 25, 26 తేదీలలో శంషాబాద్ లోని ఎలైట్ హోటల్లో నిర్వహిస్తున్నామని పాలమాకుల జంగయ్య తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని ఆయన తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండో ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయకుండా ఓట్లేసిన ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. సర్ తీసుకొచ్చి ప్రాథమిక ఓటు హక్కును కాలరాసే కుట్ర చేస్తున్నదని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం బిజెపి పార్టీ ఓట్ల చోరీకి పాల్పడుతున్నదని ఈవీఎం ట్యాంపరింగ్ చేసి గెలుస్తున్నాదని ఆయన విమర్శించారు. బిజెపి కి గాని నా మోడీ ప్రభుత్వానికి గాని దమ్ము ధైర్యం ఉంటే బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓట్లు వేసి గెలవాలని ఆయన అన్నారు. సిపిఐ పార్టీ ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఓటు నియోగదారులకు అందరికీ సాధారణ ప్రజలకు సిపిఐ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. జూన్ 25, 26 తేదీలలో జరిగే సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన కోరారు . విలేకరుల సమావేశంలో సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.యాదగిరి, మండల కార్యదర్శి నర్రగిరి పాల్గొన్నారు.---

# ముంచుకొస్తున్న ముప్పు- 17 లక్షల ఎకరాల్లో పంట వ్యర్థాల కాల్చివేత

## సంచలన గణాంకాలు వెల్లడించిన అగ్రి వర్సిటీ ఉపకులపతి



**గండిపేట(క్రైం మిర్రర్):** గత రెండు, మూడు సంవత్సరాల నుండి మొదలైన పంట వ్యర్థాల కాల్చివేత ఈ యాసంగి నాటికి 17 లక్షల ఎకరాల్లో పంట వ్యర్థాలని అగ్నికి ఆహుతి చేసినట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఒక పత్రికా ప్రకటన లో ఈ సంచలనాత్మక గణాంకాలని విడుదల చేసారు. విశ్వవిద్యాలయం లో ఇటీవల నెలకొల్పిన అధు నాతన ( రిమోట్ సెన్సింగ్, జియో ఇన్ఫర్మేటిక్ సిస్టం) ప్రయోగ శాలలో గత ఏప్రియల్, మే,జూన్ నెలల్లో ఉపగ్రహ ఛాయా చిత్రాలని విశ్లేషించి ఈ గణాంకాలని విడుదల చేశారు. మొత్తం 17 లక్షల ఎకరాలలో పంట వ్యర్థాలని ఆయా పొలాలలోనే కాల్చగా సుమారు 9 లక్షల ఎకరాల్లో వరి కోత అనంతరం వరి కొయ్యలు, గడ్డిని ఆయా పొలాలలోనే కాల్చివేసినట్లు గా ఈ గణాంకాలు చెప్తున్నాయి. మిగతా 8 లక్షల ఎకరాలలో ముఖ్యంగా మొక్కజొన్న, జొన్న పంటల వ్యర్థాలు అగ్నికి అహుతి అయినట్లు ఈ గణాంకాలు వెల్లడించాయి. తెలంగాణా లోని 33 జిల్లాలలో అత్యధిక పంట వ్యర్థాలని కాల్చివేసిన మొదటి ఐదు స్థానాలలో నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, కామారెడ్డి, పెద్దపల్లి జిల్లాలు ఉన్నాయని జానయ్య తెలిపారు. మొత్తం 17 లక్షల పంట వ్యర్థాల కాల్చివేసిన విస్తీర్ణం లో పై ఐదు జిల్లాల వాటా 34 శాతం ఉండటం గమనార్హం. అదే విధంగా అతి తక్కువ పంట వ్యర్థాలని కాల్చివేసిన జిల్లాలు రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలని జానయ్య పేర్కొన్నారు.

**ముంచుకొస్తున్న ప్రమాదం...**

పంట వ్యర్థాలని కాల్చివేయడం వల్ల నేల ఆరోగ్యం,గాలి నాణ్యత లు తీవ్రంగా కలుషితం అవుతాయనీ, ఈ పంట వ్యర్థాల కాల్చివేత ని వెంటనే ఆపాల్సిన అవసరం ఉందని జానయ్య రైతులని కోరారు.పంట వ్యర్థాల కాల్చివేత మూలాన నేల లోని రెండున్నర సెంటిమీటర్ల దిగువ భాగం లో నేల ఆరోగ్యానికి మరియు పంటలకి సంబంధించిన లాభసాటి , ఫంగల్ సూక్ష్మ జీవులు ఈ అగ్నికి ఆహుతి అవుతాయని తద్వారా నేల నిస్సారం గా మారే ప్రమాదం ఉందన్నారు.ఒక టన్ను వరి గడ్డి, కొయ్యలని పంట పొలాల్లో కాల్చివేయడం వల్ల ఐదున్నర కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాష్ అగ్నికి అహుతి అయి గాలి లో కలసిపోతాయని జానయ్య వివరించారు. అదే విధంగా ఒక ఎకరానికి సుమారు రెండున్నర టన్నుల వరిగడ్డి మరియు వ్యర్థాలు వస్తాయని, అనగా ఒక ఎకరం వరి విస్తీర్ణం లో ఈ పంట వ్యర్థాలని కాల్చినట్లయితే 13.5 కిలోల భాస్వరం, 6.75 కిలోల పొటాష్ గాలి లో కలసిపోయి తద్వారా గాలి కాలుష్యం తీవ్రంగా పెరుగుతుందని జానయ్య అన్నారు. ఈ లెక్కల ప్రకారం 23.63 లక్షల కిలోల నత్రజని, 11.90 లక్షల కిలోల భాస్వరం,1062 లక్షల కిలోల పొటాష్ ఈ మూడు మాసాలలోనే పంట వ్యర్థాల కాల్చివేత వల్ల గాలిలో కలసిపోయాయని తెలిపారు. ఈ పంట వ్యర్థాలని కాల్చకుండా వీటిని తిరిగి నెలలోనే కలియదున్ని కొంత కాలం కుళ్ళనిచ్చినట్లయితే నేల సారం పెరగటం తో పాటు కాలుష్యం తగ్గించగలిగే వాళ్ళమని జానయ్య అభిప్రాయపడ్డారు.



## ఘనంగా కట్టమైసమ్మ తల్లి దేవత విగ్రహ ప్రతిష్టాపన, బొడ్రాయి, నాభిశిలా ప్రతిష్టా మహోత్సవము

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక పూజలు**

గండిపేట(క్రైం మిర్రర్): అమ్మవారి కృపతో, ప్రజలందరికి ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలు కలగాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అమ్మవారికి వేడుకున్నారు. మంగళవారం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి దేవత విగ్రహం మరియు బొడ్రాయి, నాభిశిలా ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు. అతిథులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై శ్రీశ్రీశ్రీ శీతలా బొడ్రాయి, నాభిశిలా, ప్రతిష్టి కార్యక్రమాలను తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశిస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.





# జాతీయ స్థాయిలో 11వ స్థానం సాధించిన హైదరగూడ ప్రాథమిక పాఠశాల

## స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్‌లో రంగారెడ్డి జిల్లాకు గర్వకారణం




**గండిపేట(క్రైం మిర్రర్):** స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్‌లో హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాల జాతీయ స్థాయిలో 11వ స్థానంలో నిలవడం గర్వకారణం అని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్లో రాష్ట్రం నుంచి మొత్తం 11 పాఠశాలలు ఎంపిక కాగా, వాటిలో 4 పాఠశాలలు రంగారెడ్డి జిల్లా నుంచి ఎంపిక కావడం విశేషం. అందులో హైదర్గూడ ప్రాథమిక పాఠశాల జాతీయ స్థాయిలో 11వ స్థానాన్ని దక్కించుకొని ప్రత్యేక గుర్తింపు పొందింది. స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్ లో పాఠశాలలను మంచినీటి సదుపాయం, శౌచాలయాల నిర్వహణ, చేతుల పరిశుభ్రత, పాఠశాల నిర్వహణ, విద్యార్థుల ప్రవర్తనలో మార్పు--సామర్థ్యాల పెంపు, మిషన్ లైఫ్ వంటి ఆరు ప్రధాన కొలమానాలపై, మొత్తం 60 సూచికల ఆధారంగా అంచనా వేసి, ఒకటి నుంచి ఐదు స్టార్ల వరకు రేటింగ్ కేటాయిస్తారు. ఈ సందర్భంగా తమ మండల పరిధిలోని పాఠశాల ఈ స్థాయి గౌరవాన్ని అందుకోవడం ఎంతో గర్వకారణమని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ తెలిపారు. అదే విధంగా, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదర్గూడ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల జ్యోతి, ఆనందం వ్యక్తం చేస్తూ తమ పాఠశాలకు ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులు సరిత, అనిత, భాస్కరాచారి, సత్యనారాయణ, శివ నారాయణ, స్థానిక దాతలు, స్వచ్ఛంద సంస్థలు , హైదరగూడ గ్రామ పెద్దలు, తల్లిదండ్రులందరికీ ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లి దండ్రులు పాఠశాల అభివృద్ధికి, సౌకర్యాలకు ఆకర్షితులై ఈ సంవత్సరం, ప్రైవేట్ పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు తమ పాఠశాలకు వస్తున్నట్లు తెలిపారు.

## ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

**రాజేంద్రనగర్ పరిధిలో ‘రోప్’ ఆపరేషన్**




**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తూ రోడ్లను ఆక్రమించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ రామకృష్ణ, సీఐ సి. హెచ్.రాజు పర్యవేక్షణలో బుధవారం స్వప్న టాకీస్ నుండి దుర్గానగర్ జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేక ‘రోప్’ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఫుట్‌పాత్‌లను, ప్రధాన రహదారులను ఆక్రమించి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న తోపుడు బండ్లు , సైన్ బోర్డులు, వాహనాలు మరియు ఇతర ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకుని, అక్కడి నుండి తొలగించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై సిపి యాక్ట్ లోని కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇకపై ఫుట్‌పాత్‌లను లేదా ప్రధాన రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రహదారులను ఆక్రమించకూడదని స్థానిక దుకాణదారులను, వ్యాపారులను ఆయన తీవ్రంగా హెచ్చరించారు. పాదచారుల భద్రతకు, సులువైన ట్రాఫిక్ నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

# బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌కు హైకోర్టులో ఊరట.. షరతులతో బెయిల్

**ఇద్దరు పూచీకత్తు సమర్పించాలని ఆదేశం**

**మే 30న అరెస్ట్ అయిన సుమన్‌కు ఇరవై ఐదు రోజుల తర్వాత బెయిల్**

**జైలు నుంచి విడుదల కానున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**

బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. సింగరేణి అధికారులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న కేసులో ఆయనకు బుధవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. ఇద్దరు వ్యక్తుల పూచీకత్తును సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ తీర్పుతో గత కొంతకాలంగా రిమాండ్‌లో ఉన్న సుమన్‌కు ఊరట లభించినట్లయింది.కేసు నేపథ్యం పరిశీలిస్తే, గత మే 26న జరిగిన పార్టీ సమావేశంలో బాల్క సుమన్, నాంపల్లిలోని సింగరేణి భవన్, మందమర్రిలోని జనరల్ మేనేజర్ కార్యాలయ అధికారులను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు అశాంతిని రేకెత్తించేలా ఉన్నాయని పేర్కొంటూ సింగరేణి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, మే 30న తెలంగాణ భవన్‌లో సుమన్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయస్థానం ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలులో సుమన్‌ను పరామర్శించి, అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై విమర్శలు గుప్పించారు.



# జొన్నగిరిలో స్వర్ణ కాంతులు...

**దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గనిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**కర్నూలు జిల్లా జొన్నగిరిలో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గని ప్రారంభం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రాజెక్టు ప్రారంభోత్సవం**

**ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి లక్ష్యంగా కార్యకలాపాలు**

**ఈ గని ద్వారా రాష్ట్రానికి రాయల్టీ రూపంలో ఏటా రూ.144 కోట్ల వరకు ఆదాయం**

**ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 600 మందికి ఉపాధి అవకాశాలు**



ఆంధ్రప్రదేశ్‌లో నూతన స్వర్ణయుగం ఆవిష్కృతమైంది. కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గనిని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి భారీగా ఆదాయం రావడంతో పాటు, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. జియోమైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (+మీ×) సుమారు రూ. 405 కోట్ల పెట్టుబడితో ఈ గనిని అభివృద్ధి చేసింది. 70 ఏళ్ల తర్వాత భారతదేశంలో సమీకృత ప్రాసెసింగ్ యూనిట్‌తో ఏర్పాటైన తొలి ప్రైవేట్ బంగారు గని ఇదే కావడం గమనార్హం. జొన్నగిరి, ఎర్రగుడి, పగిదిరాయ్ గ్రామాల పరిధిలో 597.82 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ ఓపెన్-పిట్ గని విస్తరించి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026-27) ఈ గని నుంచి సుమారు 400 కిలోల బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రానున్న కాలంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏటా ఒక టన్ను (1000 కిలోలు)కు పెంచనున్నారు. ఇక్కడ మొత్తం 12 టన్నుల బంగారు నిక్షేపాలు ఉన్నాయని అంచనా. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 300, పరోక్షంగా మరో 300 మందికి ఉపాధి లభించనుంది.ఈ గని కార్యకలాపాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో భారీ ఆదాయం అందనుంది. తొలి ఏడాది సుమారు రూ. 57 కోట్లు, పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభమయ్యాక ఏటా రూ. 144 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా. ఈ ఆదాయంతో పాటు డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ద్వారా స్థానిక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌లో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జొన్నగిరి ప్రాంతానికి 'స్వర్ణగిరి' అని పేరు మార్చాలనే ప్రతిపాదన కూడా ఉంది.భారత్ ఏటా భారీగా బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు జొన్నగిరి గని ఒక చిన్న ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. హంద్రీనీవా కాలువ నుంచి 18 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా నీటిని సేకరించి, ఇక్కడే బంగారాన్ని శుద్ధి చేసి బంగారు కడ్డీల రూపంలో రిఫైనరీలకు పంపనున్నారు. కేంద్ర ప్రభుత్వ మైనింగ్ సంస్కరణల ఫలితంగా ఈ ప్రాజెక్టు సాకారమైంది.

# మమతా బెనర్జీకి మరో షాక్..

**బెంగాల్ సీఎం సువేందును పొగిడిన మహువా మొయిత్రా!**

**సువేందుతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్న మహువా మొయిత్రా**

**గతంలో తనకు సువేందు అండగా నిలిచిన సందర్భాలను గుర్తుచేసుకున్న మహువా**

టీఎంసీ తీవ్ర సంక్షోభంలో ఉన్న సమయంలో ఈ వ్యాఖ్యలతో రాజకీయంగా కలకలం



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా, రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ నేత సువేందు అధికారిపై ప్రశంసలు కురిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆయనతో తనకు ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. పార్టీలో తిరుగుబాటు, ఎన్నికల్లో ఓటమితో టీఎంసీ తీవ్ర సంక్షోభంలో ఉన్న తరుణంలో మహువా చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మహువా మొయిత్రా మాట్లాడుతూ, "సువేందు అధికారితో నాకు వ్యక్తిగతంగా మంచి సంబంధాలు ఉన్నాయి. మేమిద్దరం టీఎంసీలో ఉన్నప్పుడు ఆయన నాకు ఎంతో మద్దతుగా నిలిచారు. ఒక రకంగా చెప్పాలంటే మా మధ్య భావోద్వేగ బంధం ఉంది" అని పేర్కొన్నారు. 2014లో లోక్‌సభ టికెట్ దక్కని సమయంలో తాను తీవ్ర నిరాశకు గురై రాత్రంతా ఏడ్చానని, ఆ సమయంలో సువేందు ధైర్యం చెప్పారని, అలాగే 2016 అసెంబ్లీ ఎన్నికల్లో తాను కరింపూర్ నుంచి పోటీ చేసినప్పుడు, సీనియర్ నేతలెవరూ రాకపోయినా సువేందు తన తొలి ర్యాలీలో పాల్గొన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ ఓటమి పాలైన విషయం విదితమే. సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగా, మమతా బెనర్జీ సైతం పరాజయాన్ని చవిచూశారు. ఎన్నికల అనంతరం టీఎంసీలో సంక్షోభం మరింత ముదిరింది. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం తమకు సుమారు 60 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని ప్రకటించింది. పలువురు ఎంపీలు కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించారు.అయితే, కాంగ్రెస్ పార్టీలో టీఎంసీ విలీనం అవుతుందన్న వార్తల్లోను మహువా మొయిత్రా కొట్టిపారేశారు.

## హైదరాబాద్ లోని ఒక ప్రధాన రహదారికి

# అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరు

**నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ట్రంప్ పేరు**

**ట్రంప్ పేరుకు సైబరాబాద్ నగరపాలక సంస్థ గ్రీన్ సిగ్నల్**

**డొనాల్డ్ ట్రంప్ ఎవెన్యూగా నామకరణం చేస్తూ తీర్మానం**



హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్‌కు వెళ్లే ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టేందుకు సైబరాబాద్ నగరపాలక సంస్థ (జవీజ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూడు కార్పొరేషన్ల ప్రత్యేక అధికారి, పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ అధ్యక్షతన మాదాపూర్‌లోని సీఎంసీకార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గచ్చిబౌలిలోని క్యూ-సిటీ కూడలి నుంచి ఐఆర్‌డీఏ కూడలి వరకు ఉన్న కీలక రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ'గా నామకరణం చేస్తూ సీఎంసీ తీర్మానం చేసింది. దీనికి సంబంధించిన అఫీషియల్ ప్రపోజల్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపాలని నిర్ణయించింది. అమెరికా కాన్సులేట్ పక్కనే ఈ రోడ్డు ఉండటం, అంతర్జాతీయంగా హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచే వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ లీగల్ డెసిషన్ తీసుకున్నట్లు తెలుస్తోంది. సీఎంసీ పరిధి నుంచి హైడ్రాకు రూ.20.60 కోట్ల నిధులు ఇవ్వాలనే ప్రతిపాదనపై ఈ మీటింగ్‌లో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మిగిలిన 3 కార్పొరేషన్లలో కూడా ఈ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ అంశం ఇంకా పెండింగులోనే ఉన్నందున, దీనిపై ఒక ఫైనల్ సొల్యూషన్ కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాయాలని జయేశ్ రంజన్ నిర్ణయించారు.

**సమావేశంలో ఆమోదం పొందిన మరికొన్ని కీలక తీర్మానాలు:**

క్రీడా వసతులు: శేరిలింగంపల్లి జోన్‌లోని ఐదు ప్రధాన ప్రాంతాల్లో సీఎస్సార్ నిధులు, పీపీపీ పద్ధతిలో ఆధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల డెవలప్‌మెంట్. గిగ్ వర్కర్లకు గుడ్ న్యూస్: అమెజాన్ (హూఖిఓశీఅ) సంస్థ భాగస్వామ్యంతో డెలివరీ బాయ్స్, గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా 'ప్రాజెక్ట్ ఆశ్రయ్ - రెస్ట్, వెల్‌నెస్ కేంద్రాలు' ఏర్పాటు.శ్మశానవాటిక ఆధునికీకరణ: రూ.3 కోట్ల బడ్జెట్‌తో మాదాపూర్‌లోని శ్మశానవాటికను మరింత అభివృద్ధి చేయడం.

**వ్యర్థాల క్లియరెన్స్:** ఐకియా స్టోర్ సమీపంలో పేరుకుపోయిన భారీ నిర్మాణ వ్యర్థాల కుప్పలకు శాస్త్రీయంగా పరిష్కారం చూపేందుకు ఒక స్పెషల్ కన్సల్టెన్సీ నియామకం.జీడిమెట్ల వార్డు కార్యాలయాన్ని ఎక్సైజ్ శాఖ అవసరాల కోసం కేటాయింపు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తి

**వారం రోజులపాటు జైలు శిక్ష విధించిన కోర్టు**

నిజామాబాద్: మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి కోర్టు ఏడు రోజుల సాధారణ కారాగార శిక్ష విధించిందని ఐదవ టౌన్ ఎస్సై సునీల్ వెల్లడించారు. స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన సమయంలో షేక్ హబీబ్ అనే వ్యక్తికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించగా అతడు మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లుగా నిర్ధారణ అయినట్లు ఎస్సై వివరించారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి బుధవారం ప్రత్యేక జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా కోర్టు శిక్ష విధించిందని వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు సదరు నిందితుడిని నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు డ్రైవ్ చేయవద్దని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

## నిజామాబాద్‌లో అనూహ్యఘటన

**కస్టమర్‌లో వచ్చి కారుతో ఉడాయింపు**

నిజామాబాద్: కారు కిరాయకు మాట్లాడుకున్న వ్యక్తి డ్రైవర్ దిగి అరటి పళ్లు తెచ్చేలోగా రారుతో ఉడాయించాడు. ఈ ఘటన నిజామాబాద్‌లో జరిగింది. రోడ్డు పక్కన కారు ఆపి అరటి పళ్లు తెచ్చేలోపే కారు మాయమైన సంఘటన నిజామాబాద్ పట్టణంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. కుద్రిత్ బేగ్ అనే వ్యక్తి కారు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి లాగే కిరాయి కోసం పట్టణంలోని చెన్నై షాపింగ్ మాల్ వద్దనున్న అడ్డా వద్ద కారును నిలిపాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వచ్చి నాందేడ్‌కు వెళ్లాలని కుద్రిత్ బేగ్ కారును రూ.4 వేలకు కిరాయికి కుదుర్చుకున్నాడు. కారు గాంధీ చౌక్ వద్దకు రాగానే సదరు కస్టమర్ అరటి పండ్లు తెమ్మని డ్రైవర్ కుద్రిత్ బేగ్‌ను కోరాడు. కారు పక్కకు ఆపి అరటి పండ్లు తీసుకుంటుండగా కిరాయి కుదుర్చుకున్న వ్యక్తి కారుతో పరారయ్యాడు. మోసపోయానని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వర్షాకాలంలో పోలీసులకు ఆసరా

**రెయిన్‌కోట్లు పంపిణీ చేసిన కమిషనర్**

రామగుండం: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వర్షాకాలంలో విధి నిర్వహణకు ఉపయోగపడే రెయిన్‌కోట్లను కమిషనర్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎండనకా, వాననకా రాత్రింబవళ్లు కష్టపడి విధులు నిర్వహించే సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో రెయిన్‌కోట్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విధి నిర్వహణ సమయం లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి సమర్థవంతంగా బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్,మల్లేశం,రమేష్ పాల్గొన్నారు.

## గ్రామంలో రెచ్చిపోయిన వీధి కుక్కలు

ఆరుగురిపై దాడిచేసి గాయపరచడంతో ఆస్పత్రికి తరలింపు

జగిత్యాల,జూన్24(ఆర్ఎన్ఎ): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుడిసెల పేట గ్రామంలో బుధవారం పిచ్చికుక్కలు రెచ్చిపోయాయి. వీర విహారం చేసి ఆరుగురిని తీవ్రంగా గాయపరిచాయి. గుడిసెల నరసమ్మ ముఖంపై తీవ్రంగా గాయం కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మరో ఐదుగురిని చాతిలో , తలకు, ముఖం, కాళ్లకు పై దాడి చేయగా గాయాలయ్యాయి. వీరందరినీ హుటాహుటినా అంబులెన్స్ లో జగిత్యాల ప్రభుత్వ దవఖానాకు తరలినీచి చికిత్స అందిస్తున్నారు.

## ఒకరికి ఒకే ఓటును అమలు చేయండి

**బోగస్ ఓట్లను మాత్రమే తొలగించాలి**

**ఎన్నికల ప్రధానాధికారికి బిఆర్ఎస్ వినతి**

హైదరాబాద్: బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు కలిశారు. ప్రత్యేక సవివర ఓటరు జాబితా సవరణపై ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌తోపాటు బీఆర్ఎస్ నాయకుడు కురువ విజయ్ సీఈవో సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. 'ఒక వ్యక్తి ఒక ఓటు' సూత్రాన్ని కచ్చితంగా అమలు చేసి, ద్వంద్వ ఓటరు నమోదులను గుర్తించి తొలగించాలని బీఆర్ఎస్ నేతలు ఎన్నికల సంఘాన్ని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పునాదులను విధ్వంసం చేసేటటువంటిది.. రాజ్యాంగ స్ఫూర్తిని సర్వనాశనం చేసేటటువంటిది. పవిత్రమైన ఎన్నికల పక్రియను పూర్తిగా భ్రష్ఠు పట్టించే పక్రియ డూప్లికేట్ ఓటర్లు అని అన్నారు. ఈ బోగస్ ఓటర్లు, డూప్లికేట్‌ఓటర్ల వల్ల పవిత్రమైన ప్రజాస్వామ్య యుత ఎన్నికల పక్రియను సర్వనాశనం చేస్తున్నారో దాన్ని సరిదిద్దడం కోసమే మేం ముందుకొచ్చామని కేంద్ర ఎన్నికల సంఘం పలు మార్లు చెబుతూ ఎస్ఐఆర్ అనే పక్రియను మనముందుకు తీసుకొచ్చింది. కేసీఆర్, బీఆర్ఎస్, ఇతర రాజకీయ పార్టీలు ప్రజలంతా పెద్ద ఎత్తున ఈ ఎస్ఐఆర్ పక్రియలో భాగస్వామ్యులవుతున్నారు. అయితే దీంట్లో కొలిక్కిరాని అందరూ అర్థం చేసుకోవాల్సిన విషయం ఏంటంటే.. బోగస్ ఓట్ల విషయంలో మేం గతంలో జూబ్లీహిల్స్ ఎన్నిక జరిగినప్పుడు చెప్పినం. నిన్న కూడా చెప్పినం. ఇవాళ కూడా చెప్తున్నం. వివిధ రాష్టాల్లో్ వ్యక్తులకు సంబంధించిన డూప్లికేట్ ఓట్లను డిలీట్ చేసే మెకానిజం ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం దగ్గర లేదు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.